

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం


PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275



గురువారం | 24-09- 2026 | సంపుటి: 17, సంచిక: 173, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



ఉద్యోగ సంఘాలతో

చర్చలు సఫలం

రెండు డీఏలకు సర్కార్ ఓకే

నాలుగు నెలల తర్వాత మరో డీఏ

ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజాకలం) :

తెలంగాణ ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చలు ముగిశాయి. రెండు డీఏలు ఇచ్చేందుకు సర్కార్ అంగీకరించింది. అలాగే నాలుగు నెలల తర్వాత మరో డీఏ ఇచ్చేందుకు ఓకే చెప్పింది. అంతేకాకుండా, ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. గడువులోపే పీఆర్సీ ప్రకటించాలని కోరాయి.

తరువాయి 2వ పేజీలో...

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

తెలంగాణ భవిష్యత్తు, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే చారిత్రాత్మక ఘట్టమిది



- అధికారులంతా స్ఫూర్తితో భాగస్వాములు కావాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు
- దేశ, విదేశాల్లో రోడ్‌షోలు..
- వార్‌రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజాకలం) :

తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 2026 డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026' ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. "తెలంగాణ భవిష్యత్తును, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చారిత్రాత్మక ఘట్టంలో అధికారులంతా భాగస్వాములై 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'ను దిగ్విజయం చేయాలి" అని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు నిర్వహించనున్న ఈ గ్లోబల్ సదస్సు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు, ప్రచారం, రోడ్‌షోల నిర్వహణపై డిప్యూటీ సీఎం పక్కా కార్యాచరణను ఖరారు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచ సదస్సు ఇదని, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు.

తరువాయి 2వ పేజీలో...



ఉగ్రవాదులం కాదు..

బాధితులం

ఐరాసలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

యూఎన్: తమది ఉగ్రవాద దేశమంటూ నిందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో తాజాగా ప్రసంగించిన ఆయన అమెరికా ఆరోపణలను తిప్పికొట్టారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో తామే బాధితులుగా మిగిలామని అన్నారు. 'నిన్న ట్రంప్ మమల్ని బెదిరిస్తులని అన్నారు. కానీ మేము ఉగ్రవాద బాధితులుగా ఉన్నాము' అని అన్నారు. అమెరికా మిలిటరీ చర్యల సందర్భంగా ఇరాన్‌లోని మినాబ్ స్కూల్‌పై జరిగిన దాడి చిత్రాలను కూడా ఆయన ప్రదర్శించారు. ఈ దాడిలో మృతి చెందిన చిన్నారులు, వారి సమాధుల ఫొటోలను చూపించారు. ఇరాన్ సుప్రీం లీడర్ మృతి,

తరువాయి 2వ పేజీలో...



అల్పపీడనం ప్రభావంతో

భారీ వర్షాలు


కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజాకలం) :

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

కలం కౌంటర్





ఈసీ నియామక చట్టంపై సుప్రీంలో భిన్న తీర్పులు


2

సంగీత దిగ్గజానికి

ఆస్ట్రేలియా ఘన గౌరవం!

50 ఏళ్ల సంగీత ప్రయాణానికి గుర్తింపుగా ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల

మెల్‌బోర్న్: భారతీయ సినీ సంగీతానికి తనదైన బాణీని అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఆస్ట్రేలియాలో ప్రత్యేక గౌరవం లభించింది. ఆయన సినీ సంగీత ప్రస్థానంలో 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మెల్‌బోర్న్‌లోని విక్టోరియా పార్లమెంట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళయరాజా చిత్రంతో కూడిన స్మారక పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించారు. విక్టోరియా ఆర్థిక మంత్రి ఎన్వర్ ఎర్డోగాన్ ఎంపీతో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తమిళనాడులోని ఓ మారుమూల గ్రామం నుంచి సంగీత ప్రపంచంలోకి వచ్చిన తనకు ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో లభించిన ఈ గుర్తింపు ఎంతో భావోద్వేగానికి గురిచేసిందని ఇళయరాజా తెలిపారు. తన సంగీత ప్రయాణంలో తోడుగా నిలిచిన కళాకారులు, అభిమానులు, వివిధ తరాల శ్రోతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఇళయరాజా 50 ఏళ్ల సినీ సంగీత ప్రస్థానాన్ని పురస్కరించుకుని పలు దేశాల్లో సంగీత కచేరీలు నిర్వహిస్తున్నారు.





రాష్ట్రాల వారీగా బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌లు

తెలంగాణకు సునీల్ బన్సల్

న్యూఢిల్లీ: బీజేపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం ఈ నియామకాలను ప్రకటించారు. అందులో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించగా.. ఆ రెండు రాష్ట్రాలకు సిద్ధార్థ్ శంభు కో-ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. తెలంగాణతో పాటు వశ్చిమ బెంగాల్ పార్టీ వ్యవహారాల బాధ్యతలను సునీల్ బన్సల్‌కు అప్పగించారు. తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ కో-ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు.

తరువాయి 2వ పేజీలో...

ప్రజల ముంగిటకే

'మీ సేవ'లు

- 'డిజిటల్ గవర్నెన్స్'లో రోల్ మోడల్ గా తెలంగాణ
- తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు
- 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజాకలం) :

'గుడ్ గవర్నెన్స్'కు టెక్నాలజీని జోడించి 'డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్ కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే... జనన/మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికేట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు

తరువాయి 2వ పేజీలో...



రిమ్స్‌లో చిన్నారుల మరణాలు

ప్రభుత్వ హత్యలే

- టీఆర్ఎస్ చీఫ్ కవిత

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజాకలం):

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఏసీ పేలుడు ఘటనలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాధితులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. రిమ్స్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే అని విమర్శలు చేశారు. దత్తత తీసుకున్న జిల్లాలో చిన్నారులు చనిపోతే ముఖ్యమంత్రికి వచ్చే తీరిక లేదా? అని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు మాత్రం సమయం ఉంటుందా? అని ఎద్దేవా చేశారు.

తరువాయి 2వ పేజీలో...

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి...

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని వెల్లడించారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు.హో అధికారుల కమిటీలతో పాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లుగా నియమించినట్లు తెలిపారు. ప్రతి కమిటీకి కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజూ కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వ్యూహాత్మకంగా వినియోగించుకోవాలని సూచించారు. “ఈ రోజు నుంచే ప్రతిరోజూ నదస్సుకు సంబంధించిన ఏదో ఒక వార్త మారుమోగాలి. ప్రచారానికి ఆకాశమే హద్దుగా పనిచేసి, పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలి” అని అధికారులకు స్పష్టం చేశారు.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర లక్ష్యంలో ఈ సమ్మిట్ కీలక మైలురాయి కానుందని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఎంఓయూలను కూడా సమీక్షించి, వాటి అమలు పురోగతిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతి అధికారి భాగస్వామి కావాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆస్తిగా తీర్చిదిద్దాలని అన్నారు. తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దేశాలు, నగరాలు, రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలనిహో సూచించారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించి మంత్రిమండలి ఉపసంఘానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి రోడ్‌షోలను ప్రారంభించాలన్నారు. అధికారులు వెంటనే తమ టీమ్‌లతో సమావేశమై వార్ రూమ్ ద్వారా పనులను పర్యవేక్షించాలని, ప్రతిరోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేసిన తర్వాతే రోజువారీ బాధ్యతలు ముగించాలని చెప్పారు. ప్రతినిధుల స్పందనను బట్టి అవసరమైతే ప్రస్తుతం అనుకుంటున్న 4 సభా ప్రాంగణాలను (హాల్స్) 6 లేదా 8కి పెంచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక వికాసంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడా రాజీ పడకుండా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను చారిత్రాత్మక విజయం చేయాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

ఈసీ నియామక చట్టంపై సుప్రీంలో భిన్న తీర్పులు



ఢిల్లీ, సెప్టెంబర్ 23: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 కొత్త చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి పంపాలనే అంశంపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏకీభవించలేకపోయింది. ఈ కేసును విచారించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ధర్మాసనం కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించాలా వద్దా అనే అంశంపై చెరో అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

జస్టిస్ దీపాంకర్ దత్తా ఆవేదన: సంస్థాగత ఐక్యత దృష్ట్యా ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు ఇచ్చి ఉంటే బాగుండేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. అభిప్రాయ భేదాలు తలెత్తడం వల్లే సుదీర్ఘమైన ఉత్తర్వులు రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

పాలకులు చట్టానికి లోబడి ఉండాలి..తీర్పు సందర్భంలో జస్టిస్ దీపాంకర్ దత్తా కొన్ని సంచలన, కీలక వ్యాఖ్యలు చేశారు. ‘పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. వారెవరూ చట్టానికి అతీతులు కారు’ అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలు లేదా అభీష్టం ప్రకారం కాకుండా, రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఉద్ఘాటించారు.

కొలీజియం వ్యవస్థపై స్పష్టత...జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించింది.’జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు’ అనేవార్తలు లేదా ప్రచారం తీవ్ర అసత్యమని తేల్చిచెప్పింది.అభ్యర్థుల పరిశీలన, ఎంపిక విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇంటెలిజెన్స్ బ్యూరో , ఇతర నిఘా వర్గాల పాత్ర ఎంతో స్పష్టంగా ఉంటుందని వివరించింది.

ప్రజల ముంగిటకే ‘మీ సేవ’లు

మొదటి పేజీ తరువాయి...

తదితర మీ సేవా సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలిదశలో ‘క్యూర్’ ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని... ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, విశిష్టత ప్రతిబింబించేలా ఈవెంట్ ని నిర్వహించాలి

రాష్ట్రంలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 కేవలం పెట్టుబడుల సమీకరణకే పరిమితం కాకుండా, తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఉండాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. .ఫైవ్ స్టార్ హోటళ్ల వాతావరణం దేశవ్యాప్తంగా ఎక్కడైనా సాధారణంగానే ఉంటుందని, అయితే మన రాష్ట్ర ప్రత్యేకతను విదేశీ, జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు ఈ ఈవెంట్‌లో ప్రధానంగా ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారిణి హరిచందనకు సూచించారు. బతుకమ్మ వంటి పండుగల నిర్వహణ మనకు కొత్తేమీ కాదని, గతంలోనూ సమర్థవంతంగా నిర్వహించామని గుర్తు చేస్తూ, సాంస్కృతిక శాఖ సమన్వయంతో మరింత అద్భుతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సాధారణ హోటళ్ల వాతావరణం అంతర్జాతీయ, జాతీయ అతిథులకు అంత ప్రత్యేకంగా అనిపించకపోవచ్చని, కాబట్టి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడానికి ఇదొక అద్భుత అవకాశమని పేర్కొన్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి దాదాపు 2,000 నుండి 3,000 మంది ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి మన సంస్కృతి ఒక దృశ్యకావ్యంగా నిలిచిపోవాలని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరిగిన జి20, బ్రిక్స్ సమ్మిట్‌ల తరహాలోనే సాయంత్రం వేళల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు మన వారసత్వాన్ని సమున్నతంగా చాటిచెప్పేలా ప్లాన్ చేయాలన్నారు.

రాష్ట్రానికి ప్రధానంగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమైనప్పటికీ, అంతర్జాతీయ వేదికపై నూతన తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి చాటిచెప్పడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని మంత్రి శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు.

ఉద్యోగ సంఘాలతో చర్చలు సఫలం

మొదటి పేజీ తరువాయి...

డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది: లచ్చిరెడ్డి

సమావేశం అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిన్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ... సీఎస్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కమిటీ మీటింగ్ జరిగిందని తెలిపారు. ఉద్యోగుల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 6న ఉద్యోగ సంకల్ప సభ నిర్వహించామని తెలిపారు. మొత్తం 68 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని.. అన్ని సమస్యల పరిష్కారానికి మార్గం చూపించినట్లు తెలిపారు. తమ డిమాండ్ల విషయంలో చొరవ తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ సంజయ్ జాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదటి డీఏ 3.64, రెండో డీఏ 2.74 కు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. కమిటీ నివేదిక రాగానే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

రెండుగా చీలిన ఉద్యోగ సంఘాలు

ప్రభుత్వంతో చర్చల అనంతరం ఉద్యోగ సంఘాలు చెరో దారిలో వెళ్లాయి. రెండు డీఏలు ఇస్తామన్న సర్కార్ హామీని రెవెన్యూ సంఘం స్వాగతించింది. ఉద్యోగులకు మంచి రోజులు వచ్చాయని భావిస్తోంది. అయితే, రెండు డీఏలకు మాత్రమే ప్రభుత్వం అంగీకరించడం పట్ల టీఎన్‌జీవో, టీజీవో సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. పెండింగ్ బిల్లులపై సీఎం, డిప్యూటీ సీఎం హామీ ఇవ్వాలని కోరుతున్నాయి. నాంపల్లి టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో, టీజీవో ఉద్యోగ సంఘాల నేతల అత్యవసర సమావేశమయ్యాయి.

అఖీరా ఎంబీబీఎస్ కలకు మానవతా విలువల అండ

పార్టీలకు అతీతంగా స్పందించిన దాతలు.. -రూ.60 వేల డీడీతో అడ్మిషన్‌కు మార్గం.
-సోషల్ మీడియా స్పందనతో కదిలిన దాతలు.. మంత్రి దృష్టికి వెళ్లిన సమస్య.

సెప్టెంబర్ 22 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

చదువుపై పట్టుదల..

వైద్యురాలు కావాలన్న లక్ష్యం.. నీట్‌లో సీటు సాధించిన ప్రతిభ.. అయితే అడ్మిషన్‌కు అవసరమైన ఆర్థిక స్థోమత లేకపోవడం కొండేటి అఖీరా కుటుంబానికి తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ సమయంలో పట్టణానికి చెందిన పలువురు దాతలు, ప్రజలు పార్టీలకు అతీతంగా మానవతా దృక్పథంతో స్పందించారు. తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించడంతో పాటు సమస్యను సంబంధిత పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. చివరకు రూ.60 వేల డీడీతో అడ్మిషన్ పొందే అవకాశం లభించడంతో అఖీరా వైద్య విద్యలో అడుగుపెట్టింది.

‘చదువు ఆగిపోనివ్వం’ అంటూ భరోసా

అఖీరా పరిస్థితి పట్టణంలోని పలువురి దృష్టికి రావడంతో వారు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. తమకు తోచిన మేరకు ఆర్థిక సహాయం అందిస్తూ ‘చదువు ఆగిపోనివ్వం.. మేమున్నాం’ అంటూ భరోసా కల్పించారు. అఖీరా ఎంబీబీఎస్ విద్యను కొనసాగించే వరకు తమవంతు సహకారం అందిస్తామని పలువురు హామీ ఇచ్చారు.

సోషల్ మీడియాలో విస్తృత స్పందన

అఖీరా పరిస్థితిని తెలుసుకున్న పలువురు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నీట్‌లో సీటు సాధించిన విద్యార్థిని కేవలం ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య విద్యకు దూరం కాకూడదని దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ విజ్ఞప్తికి స్పందించిన పలువురు తమ వంతు సహాయం చేసేందుకు ముందుకు రావడంతో అఖీరా కుటుంబంలో ఆశలు చిగురించాయి.

మంత్రి దృష్టికి సమస్య

అడ్మిషన్‌కు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని పలువురు తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు అఖీరా కుటుంబ సభ్యులు తెలిపారు. పేద విద్యార్థిని వైద్య విద్యను కొనసాగించేలా సహకరించాలని కోరినట్లు పేర్కొన్నారు.

రూ.60 వేల డీడీతో అడ్మిషన్


మంత్రి ఆదేశాల మేరకు మహేశ్వర మెడికల్ కాలేజీ యాజమాన్యం స్పందించినట్లు అఖీరా కుటుంబ సభ్యులు తెలిపారు. రూ.60 వేల డీడీ మినహా అదనంగా ఎలాంటి మొత్తాన్ని వసూలు చేయకుండా అడ్మిషన్‌కు సహకరించినట్లు పేర్కొన్నారు. దీంతో అఖీరా ఎంబీబీఎస్ విద్యలోకి అడుగుపెట్టే అవకాశం లభించింది.

సహాయాన్ని రాజకీయాలకు ఆపాదించొద్దు

అఖీరాకు సహాయం చేసిన పలువురు మాట్లాడుతూ.. విద్యార్థిని భవిష్యత్తు కోసం అందించిన సహాయాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఆపాదించడం సరికాదన్నారు. పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడనే ఉద్దేశంతోనే తాము స్పందించామని తెలిపారు. అఖీరాకు అందిన సహాయం ఏ ఒక్క రాజకీయ పార్టీ కార్యక్రమం కాదని, మానవతా దృక్పథంతో చేసిన సామాజిక బాధ్యతగా పేర్కొన్నారు.

అడ్మిషన్‌పై రాజకీయ ప్రచారంపై ఆవేదన

అఖీరా అడ్మిషన్ సెప్టెంబర్ 19న పూర్తయిందని కుటుంబ సభ్యులు, సహాయం చేసిన వారు చెబుతున్నారు. అయితే సెప్టెంబర్ 21న తమ చొరవ వల్లే అఖీరాకు అడ్మిషన్ లభించిందంటూ కొందరు రాజకీయ వర్గాలు ప్రచారం చేస్తున్నాయనే ఆరోపణలపై పలువురు పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.అదే సమయంలో, జైభీమ్ ఫౌండర్ చైర్మన్ జైభీమ్ శివ ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, సూచనతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి చొరవతో 106000/-డి డి ని తిరిగి వారికే ఇప్పించి కేవలం రూ.60 వేల డీడీతో అడ్మిషన్‌కు అవకాశం కల్పించిన అంశాన్ని పక్కనపెట్టి, విద్యార్థినితో సోషల్ మీడియా వేదికగా వారే మొత్తం చేయించారని మాట్లాడించి దానిని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం సరికాదని కొందరు పట్టణ ప్రజలు అభిప్రాయపడ్డారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత రాజకీయ వర్గాల వివరణ వెలువడాల్సి ఉంది.ముమ్ముందు మరెవరైనా పేద మధ్య తరగతి వారికి సహాయం అందించాలంటే దాతలు సంకొంచంలో పడే దుర్గటన నెలకొనవచ్చని సంఘ సంస్కర్తల వాదన.



చదువు పూర్తయ్యే వరకు అండగా..

అఖీరా ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు తమవంతు సహకారం అందిస్తామని పలువురు దాతలు హామీ ఇచ్చారు. ఒక్క విద్యార్థిని భవిష్యత్తు కోసం పలువురు కలిసి స్పందించడం సంతోషకరమని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

మొత్తంగా..

నీట్‌లో సీటు సాధించినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితిలో ఉన్న అఖీరాకు పట్టణ ప్రజలు, దాతల మానవతా స్పందన అండగా నిలిచింది. సోషల్ మీడియా ద్వారా వచ్చిన విజ్ఞప్తులు, దాతల సహకారం, సంబంధిత పెద్దల చొరవతో అడ్మిషన్ సమస్యకు పరిష్కారం లభించింది. అఖీరా వైద్య విద్యలో అడుగుపెట్టడం ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

రాష్ట్రాల వారీగా బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌లు

మొదటి పేజీ తరువాయి...

బెంగాల్‌కు లాల్ సింగ్ ఆర్య, రాజేంద్ర సింగ్, పింకీ కుష్వాహా కో-ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. దేశంలో కీలకంగా భావించే ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే పర్యవేక్షించనున్నారు. జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ శర్మ, అనంత్ ఓజా సహకార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా నియమితులవ్వగా.. అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తానవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కో-ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక.. ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత వినయ్ సహస్రబుద్ధేను నియమించారు. జమ్మూ-కశ్మీర్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్, సహ ఇన్‌ఛార్జ్‌లుగా దుష్యంత్ గౌతమ్, దర్శనా జర్దోష్ నియమితులయ్యారు. ఇటీవల నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఛార్జ్‌షీట్‌లో పేరు చేర్చిన యంగ్ ఇండియన్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో.. ఆ సంస్థ ఆస్తులను ఈడీ నుంచి తిరిగి పొందేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ, ఇతర నేతలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. ఈడీ ఛార్జ్‌షీట్‌పై స్టే విధించడానికి నిరాకరించింది. ఈ కేసులో ఈడీ ఛార్జ్‌షీట్‌పై ట్రయల్ కోర్టు విచారణ జరపవచ్చని స్పష్టం చేస


నా తేజోమయికి
నా జీవితంలో వెలుగై వచ్చావు,
నా గుండెల్లో ఆనందం నింపావు...
నీ నవ్వే నా సంతోషం,
నీ కలలే నా ఆశయం...❤️
పది వసంతాలు పూర్తి చేసుకున్న
నా బంగారు తేజోమయికి
🎂 పుట్టినరోజు శుభాకాంక్షలు! 🎉
నీ జీవితం ఎప్పుడూ
నవ్వులతో, ఆనందాలతో, విజయాలతో నిండాలి.
నాన్న ప్రేమతో... ❤️

జగన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

-2 లక్షల ఆర్థిక సహాయం అందించిన వ్యాల్ల హరీష్ రెడ్డి



ఎండపల్లి, సెప్టెంబర్ 23 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన సింహాచలం జగన్ ఇటీవల ఉరి వేసుకుని మృతి చెందారు. పెద్దకర్మ రోజున జగన్ కుటుంబాన్ని పరామర్శించి వారి పిల్లల చదువుల కోసం వ్యాల్ల హరీష్ రెడ్డి 1 లక్ష, అలాగే అమెరికాలోని హరీష్ రెడ్డి మిత్రులు ఎన్నారై బీఆర్ఎస్ మిత్రుల తరఫున మరొక్క 1 లక్ష అందించడం జరిగింది. ఈ మొత్తాన్ని పిల్లల చదువుల కోసం వినియోగించాలని కుటుంబ సభ్యులకు సూచించాను. ఈ కార్య క్రమం లో ఎండపల్లి మండల స్థాయి నాయ కులు పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. అదే విధంగా మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు కూడా హాజరై జగన్ కుటుంబాన్ని పరామర్శించారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- యూఎస్పీసి జిల్లా కమిటీ డిమాండ్

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాకలం):

ఉపాధ్యాయుడు బి. ప్రశాంత్ ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని యూఎస్పీసి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా పరిపాలనాధికారికి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కమిటీ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం చిలువకోడూరు ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ బి. ప్రశాంత్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల డెప్యూటేషన్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురైన ప్రశాంత్ సెప్టెంబర్ 22న పాఠశాల సముదాయ సమావేశం సమయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఈ ఘటనకు దారితీసిన కారణాలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి, బాధ్యులుగా తేలిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిపాలనాధికారిని కోరారు. కార్యక్రమంలో యూఎస్పీసి జిల్లా కమిటీ ప్రతినిధులు తిరుకోవెల శ్యామ్ సుందర్, భోగ రమేశ్, కొక్కుల రాంచంద్రం, ఎడ్ల గోవర్ధన్, అంబటి భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి మహిళ కూలి మృతి

-మరొక్క మహిళా కూలికి తీవ్ర గాయాలు

చికిత్స నిమిత్తం హాస్పత్రికి తరలింపు

ధర్మారం, సెప్టెంబర్ 23 : (ప్రజా కలం ప్రతినిధి) మండలం లోని చామనపల్లి గ్రామం లో పత్తి చేనులో కూలి పనులకు వెళ్లిన మహిళా కూలీల పైన పిడుగు పడి మహిళా కూలి మృతి మరొక మహిళ కూలికి



తీవ్ర గాయాలు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు మృతిచెందిన మహిళ కూలి జూలపల్లి మండలం బాలరాజు పల్లి గ్రామానికి చెందిన మారం అంజవ్వ వయసు (60)సంవత్సరాలు అనే మహిళ కూలి బుధవారం రోజున చామనపల్లి గ్రామంలో పత్తి చేనులో కూలి పనుల నిమిత్తం వెళ్లిన మహిళా కూలీలు పత్తి చేనులో కలుపు తీయుటకు తోటి మహిళ కూలీల తో పనులకు వెళ్లిన అంజవ్వ విధి వక్రీకరించిందో, ప్రకృతి ప్రకోపించిందో ఏమో కానీ ఆ మహిళ కూలి పాలిట శాపంగా మారి పిడుగు పాటుకు మహిళా కూలి అక్కడికక్కడే మృతి చెందింది ఈ సంఘటనతో ఆమెతోపాటు గా కూలిపనులకు వెళ్లిన మహిళా కూలీలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు మృతురాలు కు భర్త ఎల్లయ్య కుమారుడు సాగర్ ఉన్నట్లు స్థానికులు తెలిపారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నగునూరి శ్రీనివాస్‌కు 'బెస్ట్ మీసేవ వీఎల్ఈ' అవార్డు

పెద్దపల్లి,సెప్టెంబర్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

డిజిటల్ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన మీసేవ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నగునూరి శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం దక్కింది.మెటా యాడ్స్ క్యాంపెయిన్ ద్వారా స్థానిక వ్యాపారాల వృద్ధికి,డిజిటల్ సేవల విస్తరణకు విశేష కృషి చేసినందుకు గాను ఆయన బెస్ట్ మీసేవ వీఎల్ఈ.అవార్డుకు ఎంపికయ్యారు.తెలంగాణ మీసేవ వ్యవస్థ 15 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.డిజిటల్ వీఎల్ఈలు-బలమైన పౌరులు-ఉజ్వల తెలంగాణ అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా శ్రీనివాస్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగంగా స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించడం,ప్రజల్లో డిజిటల్ సేవలపై అవగాహన కల్పించడంలో శ్రీనివాస్ చూపుతున్న నిబద్ధతను,ప్రతిభను ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,మీసేవ ప్రతినిధులు పాల్గొన్నారు.




విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ప్రశాంత వాతావరణంలో గణేశ నిమజ్జనం -ప్రభుత్వ విప్ విజయరమణ రావు

పెద్దపల్లి:సెప్టెంబర్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తొమ్మిది రోజుల పాటు నవరాత్రులు నియమనిష్ఠలతో పూజలందుకున్న గణనాథుల నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు.బుధవారం పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద మున్సిపల్,పోలీస్ యంత్రాంగం మరియు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే గణపతి నిమజ్జన వేడుకలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సింగరేణి కోల్ మైన్స్ నుండి తెప్పించిన భారీ క్రేన్ల సహాయంతో గణనాథుడిని నిమజ్జనం చేశారు.అనంతరం వేదపండితులు ఎమ్మెల్యే విజయరమణ రావును వేదమంత్రాలతో ఆశీర్వదించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు సమయపాలన పాటించి,ప్రశాంతంగా వేడుకలు పూర్తి చేయాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసిందని,విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టిందని తెలిపారు.ఈ ప్రక్రియకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్





చైర్మన్,కమిషనర్,తహసీల్దార్,నబ్ డివిజన్ పోలీస్ అధికారులు,కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

గొల్లపెల్లి మహేష్ గౌడ్ - కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సంఘం వినతిపత్రం



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రతినిధి):

గొల్లపల్లి మండలం చిల్వకోడూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన విద్యాశాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. నిరంతర అధికారుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. చిల్వకోడూరు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ ఆత్మహత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతోనే ఐదు తరగతులకు బోధన నిర్వహించాల్సి వస్తోందని, 18 సబ్జెక్టులు, 15 వరకు పుస్తకాలు బోధించడంతో పాటు అనేక బోధనేతర, ప్రధానోపాధ్యాయ బాధ్యతలను నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. దీనికి తోడు తరచూ అధికారులు, పర్యవేక్షణ బృందాలు పాఠశాలలను తనిఖీ చేయడం వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి మరింత పెరుగుతోందన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 25 ప్రకారం 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండే విధానం ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ విధానాన్ని పునఃపరిశీలించి జీవో ఎంఎస్ నంబర్ 25ను రద్దు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడితో పాటు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాగర్, జిల్లా, మండల బాధ్యులు వెంకటేశ్, ఆంజనేయులు, రమేశ్, జితేందర్, శ్రీనివాస్, మహేశ్, భూమారెడ్డి, రమణతో పాటు జిల్లాలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ

సంఘటనలకు తావులేకుండా నిర్వహణ

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

- చింతకుంట చెరువు ఇమ్మర్షన్ పాయింట్, టవర్ సర్కిల్ వద్ద భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 23(ప్రజాకలం) జిల్లాలో గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. గణేష్ నిమజ్జనోత్సవంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని టవర్, తీన్ కాని, మంచినీళ్ల బావి, చింతకుంట చెరువు ఇమ్మర్షన్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జనోత్సవాల మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శోభాయాత్రలు సజావుగా సాగేలా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని అన్నారు. రద్దీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

గణేష్ నిమజ్జనోత్సవాలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, ప్రజల సహకారంతో జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ లు పురుషోత్తం రెడ్డి, రవికుమార్, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీఖాన్ కరుణాకర్, రామ్ నర్సింహారెడ్డి, పోలీస్ అధికారులు ఉన్నారు.

మెట్‌పల్లి డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజాకాలం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురు, శుక్రవారాల్లో స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే. వేంకయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై, ఇప్పటివరకు 'దోస్త్' ద్వారా డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరై స్పాట్ అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ కే. వేంకయ్య కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న, కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, కామర్స్ హెచ్ఓడీ ఏ. మనోజ్ కుమార్‌తో పాటు లెక్చరర్లు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) లో

పచ్చదనం - స్వచ్ఛ ధనం కార్యక్రమం



బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 23, (ప్రజాకలం) ప్రతినిధి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఈ. సోమయ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లి పురపాలక సంఘం వనమహోత్సవం లో భాగంగా బుధవారం మెగా ప్లాంటినే షన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ఆవరణ లో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు.ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనం పెంపొందించి, భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఈ.సోమయ్య మాట్లాడుతూ హరితహారం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు,మొక్కల సంరక్షణ పట్ల బాధ్యతా భావాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. మొక్కను నాటుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం అనే సందేశంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

బెంబర్లో చిరుతపులి కలకలం

- బాలాజీ గుట్ట పరిసరాల్లో వరుసగా చిరుత సంచారం


- లేగదూడను హతమార్చినట్లు రైతు వెల్లడి

- బోను ఏర్పాటు చేయాలని గ్రామస్థుల డిమాండ్



తానూర్, సెప్టెంబర్ 23(ప్రజా కలం): మండలంలోని బెంబర గ్రామ శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది, బెంబర బాలాజీ గుట్ట పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు, ఇటీవల బాలాజీ గుట్ట వద్ద చిరుత కనిపించిందని, మొన్న కూడా అదే ప్రాంతంలో పులి కనిపించినట్లు గ్రామస్థులు తెలిపారు, మంగళవారం రాత్రి వ్యవసాయ కొట్టంలో కట్టేసిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపినట్లు రైతు చుక్కబోట్ల సాయినాథ్ తెలిపారు, బుధవారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా లేగదూడ రక్తమడుగులో మృతిచెంది కనిపించిందన్నారు, సమాచారం అందుకున్న స్థానికులు ఘటనాస్థలాన్ని పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు, వరుసగా చిరుత సంచారం, పశువులపై దాడులతో రైతులు, గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది, చిరుతను వెంటనే గుర్తించి బోను ఏర్పాటు చేసి బంధించాలని అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను గ్రామస్థులు కోరుతున్నారు.

నిమజ్జనం వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారి భక్తి.



ఖమ్మం, సెప్టెంబర్ 23(ప్రజా కలం న్యూస్) ఖమ్మం పట్టణం జి ఆర్ ఆర్ శ్రీనివాసం లొ వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో ఓ చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. తలపై వినాయకుడి విగ్రహాన్ని ధరించి, ఎంతో భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాడు.వినాయకుడి విగ్రహాన్ని తలపై ఉంచుకుని చేతులతో జాగ్రత్తగా పట్టుకొని భక్తిభావంతో ముందుకు సాగుతున్న చిన్నారి దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. చిన్న వయసులోనే గణనాథుడిపై భక్తిని చాటుతూ నిమజ్జన వేడుకల్లో పాల్గొనడం పలువురిని ముచ్చటపరిచింది. ఈ సందర్భంగా అక్కడున్న భక్తులు చిన్నారిని అభినందిస్తూ ఫొటోలు తీసుకున్నారు. వినాయక నిమజ్జనానికి తరలివచ్చిన భక్తుల సందడితో పరిసర ప్రాంతాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తుల జయజయధ్వానాలు, డప్పు చప్పుళ్ల మధ్య చిన్నారి వినాయకుడిని తలపై ధరించి కనిపించడం నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక దృశ్యంగా నిలిచింది. చిన్నారి భక్తికి సంబంధించిన ఈ దృశ్యం పలువురి మనసులను ఆకట్టుకుంది.

ప్రజా కలం
గురువారం, సెప్టెంబర్ 24, 2026

జీవజాలానికి ముప్పుగా

సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు

మన చేతిలోని నీళ్ల సీసా.. మన పళ్లెంలోని అన్నం.. మనం పీల్చే గాలి.. ఇవన్నీ ప్లాస్టిక్ కణాల బారిన పడుతున్నాయా? ఒకప్పుడు మనం విసిరేసిన ప్లాస్టిక్ ఇప్పుడు కంటికి కనిపించని రూపంలో మన ఆహార గొలుసులోకే తిరిగి వస్తోంది. ఐదు మిల్లీమీటర్లకంటే చిన్నగా ఉండే సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు సముద్రాల నుంచి నదుల వరకు, నేల నుంచి గాలి వరకు వ్యాపిస్తూ జీవజాలానికి కొత్త ముప్పుగా మారుతున్నాయి. కనిపించే ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేయడం సాధ్యమే.. కానీ కనిపించని ఈ కణాలను ఏరివేయడం ఎలా? ఇదే ఇప్పుడు ప్రపంచం ముందున్న కీలక ప్రశ్న. ఐదు మిల్లీమీటర్లలోపు పరిమాణం కలిగిన ప్లాస్టిక్ కణాలను సాధారణంగా సూక్ష్మ ప్లాస్టిక్ కణాలుగా పరిగణిస్తారు. అంతకంటే చిన్నవైన నానో ప్లాస్టిక్ కణాలు మానవ కంటికి కనిపించవు. ప్లాస్టిక్ సంచులు, సీసాలు, ప్యాకింగ్ పదార్థాలు, కృత్రిమ దుస్తులు, వాహనాల టైర్లు, రంగులు వంటి పెద్ద ప్లాస్టిక్ ఉత్పత్తులు కాలక్రమంలో విచ్ఛిన్నం కావడం వీటి ప్రధాన కారణాల్లో ఒకటి. 2020లోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు 27 లక్షల టన్నుల సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు పర్యావరణంలోకి చేరినట్లు ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం అంచనా వేసింది. 2040 నాటికి ఈ పరిమాణం రెట్టింపు కావచ్చని అంచనా. నీరు, నేల, గాలితో పాటు మనం తినే ఆహారంలోనూ ఇవి చేరుతున్నాయి. చేపలు, మాంసం, కూరగాయలు, తేనె, ఉప్పు వంటి ఆహార పదార్థాల్లో వీటి ఆనవాళ్లు గుర్తించినట్లు పరిశోధనలు వెల్లడించాయి. దక్షిణాసియా దేశాలపై 2025లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం ఒక్కొక్క వ్యక్తి రోజువారీ ఆహారం ద్వారా సగటున 508 నుంచి 2,510 సూక్ష్మ ప్లాస్టిక్ కణాలను తీసుకునే అవకాశం ఉంది. చేపలు, గోధుమలు, సీసాల్లోని నీరు వీటి ప్రధాన వనరులుగా అధ్యయనం గుర్తించింది. భారత్‌లోనూ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి ప్రాంతంలో తామ్మిది సీసా నీటి బ్రాండ్లపై నిర్వహించిన అధ్యయనంలో లీటరు నీటిలో సగటున 2.89 సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు గుర్తించారు. భారతీయ బియ్యంపై నిర్వహించిన మరో అధ్యయనంలో ప్రతి 100 గ్రాముల బియ్యంలో సగటున 30.3 కణాలు గుర్తించబడ్డాయి. ఇక్కడే అసలు ఆందోళన మొదలవుతోంది. సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు జంతువుల జీర్ణవ్యవస్థలోకి చేరి ఆహార గొలుసును ప్రభావితం చేసే అవకాశం ఉంది. కొన్ని కణాలు కణజాలాల్లోకి ప్రవేశించే అవకాశం, వాటి ఉపరితలంపై ఇతర రసాయనాలు లేదా సూక్ష్మజీవులు చేరే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే మానవ ఆరోగ్యంపై వీటి దీర్ఘకాలిక ప్రభావాల విషయంలో ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. అందువల్ల భయాందోళనలకంటే శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణ అవసరం. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను సమర్థంగా వేరు చేసి పునర్వినియోగం చేయడం, తాగునీరు-ఆహారంలో సూక్ష్మ ప్లాస్టిక్ కణాలపై క్రమబద్ధమైన పరీక్షలు నిర్వహించడం, పరిశ్రమల నుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించడం అత్యవసరం. కనిపించే ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించడంతోపాటు కనిపించని కణాలపైనా నిఘా పెంచాలి. లేకపోతే మనం విసిరేసిన ప్లాస్టిక్ చివరకు మనం తినే ఆహారంగానూ, తాగే నీరుగానూ తిరిగి మన ముందుకొచ్చే ప్రమాదం ఉంది.

- సి.హెచ్. ప్రతాప్

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలి

- అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 23 (ప్రజా కలం):

జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య అధికారులను, రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 96,911 మంది ఓటర్లకు హియరింగ్ పూర్తయిందని, మరో 18,700 మంది ఓటర్లు నోటీసులు అందుకుని హియరింగ్‌కు హాజరు కావాల్సి ఉందని అదనపు



కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత బీఎల్ఓల సమక్షంలో నిర్ణీత సమయంలో హియరింగ్‌కు హాజరై అవసరమైన పత్రాలను సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు షెడ్యూల్‌ను వివరించారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 28న ప్రజా ప్రకటన జారీ చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 15న, 25న నోటీసుల పునఃప్రచురణ, నవంబర్ 6న దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబర్ 25న వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఎవరూ ఓటరు జాబితాలో తప్పిపోకుండా అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని చెన్నయ్య కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రజల్లోవిస్తృత అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యల్లో అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల విభాగం అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.







అమ్మను మించిన దైవం ఉన్నదా..

డాక్టర్ రఘు మాతృమూర్తి పుష్పలతకు ఘన నివాళులు

రాజకీయాలకు అతీతంగా తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు.. రఘు కుటుంబానికి పరామర్శ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి , సెప్టెంబర్ 23(ప్రజా కలం): తల్లి ప్రేమకు మించిన అనుబంధం లేదని, తల్లి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని పలువురు పేర్కొన్నారు. టీఆర్ఎస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు మాతృమూర్తి చిట్నేని పుష్పలత ఇటీవల పరమపదించిన నేపథ్యంలో బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల రోడ్‌లో గల విదిత్ రెడ్డి గార్డెన్‌లో 12 వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పలత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ రఘు, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పుష్పలత మృతి పట్ల సంతాపం

పుష్పలత మృతి పట్ల పలువురు నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తల్లిని కోల్పోవడం కుటుంబానికి పూడ్చలేని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

రాజకీయాలకు అతీతంగా నేతల హాజరు

12 వ రోజు కార్యక్రమానికి నియోజకవర్గంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరు కావడం ప్రత్యేకంగా నిలిచింది. రాజకీయ భేదాలను పక్కనపెట్టి ఒకే వేదికపైకి వచ్చిన నాయకులు పుష్పలతకు నివాళులర్పించారు. వివిధ రాజకీయ, సామాజిక వర్గాలతో డాక్టర్ రఘు పరిచయాలకు ఈ కార్యక్రమానికి తరలివచ్చిన జనసందోహం నిదర్శనంగా నిలిచింది.

విషాదభరిత వాతావరణంలో ...

విదిత్ రెడ్డి గార్డెన్‌లో జరిగిన 12 వ రోజు సందర్భంగా విషాదభరిత వాతావరణం నెలకొంది. పుష్పలతను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు, బంధువులు, నన్నిహితులు భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు డాక్టర్ రఘును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అమ్మ ప్రేమకు సాటిలేదు

తల్లి ప్రేమ, త్యాగం, ఆప్యాయతలకు సాటిగా ప్రపంచంలో మరేదీ లేదని పలువురు పేర్కొన్నారు. పిల్లల ఎదుగుదలలో తల్లి పాత్ర మరువలేనిదని, తల్లి భౌతికంగా



దూరమైనా ఆమె అందించిన ప్రేమ, ఆప్యాయతలు, కుటుంబానికి చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు.

రఘు కుటుంబానికి అండగా నియోజకవర్గ ప్రజలు

పుష్పలత మృతి వార్త వెలువడినప్పటి నుంచి వివిధ వర్గాల ప్రజలు డాక్టర్ రఘు కుటుంబాన్ని పరామర్శిస్తూ వచ్చారు. 12 వ రోజు సందర్భంగా కూడా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పుష్పలత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పుష్పలత భౌతికంగా దూరమైనప్పటికీ మాతృమూర్తి జ్ఞాపకాలు కుటుంబ సభ్యుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని వలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం డాక్టర్ రఘు మాతృమూర్తి కి ఘన నివాళిగా కొనసాగింది.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

మెట్‌పల్లిలో ఘనంగా ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు - నిమజ్జనానికి భారీ పోలీసు బందోబస్తు









మెట్‌పల్లి:(కోరుట్ల) సెప్టెంబర్ 23 (ప్రజా కలం): మెట్‌పల్లి పట్టణంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ కుల, వాణిజ్య, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజైన బుధవారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన వినాయకుల శోభాయాత్ర చౌరస్తా, మార్కెట్ రోడ్, పాత బస్టాండ్, జాతీయ రహదారి మీదుగా బస్ డిపో నుంచి మహాలక్ష్మి ఆలయం సమీపంలోని వట్టివాగు వరకు కొనసాగింది. అక్కడ మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్ల సహాయంతో వినాయక విగ్రహాలను వట్టివాగులో నిమజ్జనం చేశారు. నిమజ్జన ఏర్పాట్లను ఉదయం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. నిమజ్జనానికి తరలివచ్చిన వినాయక విగ్రహాలకు, మండపాల నిర్వాహకులకు స్వాగతం పలికారు. పట్టణంలో నిమజ్జనోత్సవం సందర్భంగా సందడి నెలకొంది. ప్రత్యేక వాహనాలపై వినాయక విగ్రహాలను శోభాయాత్రగా తరలించారు. యువకులు, కుల సంఘాల సభ్యులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వయోభేదం లేకుండా నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాల మధ్య శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది.

భారీ పోలీసు బందోబస్తు

నిమజ్జనోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు ఆధ్వర్యంలో సీఐలు సురేశ్ బాబు, లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బందితో పాటు ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, నవీన్, శ్రీధర్ రెడ్డి, రవికుమార్ తదితరులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లోనూ వినాయక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, మండపాల నిర్వాహకులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన కార్యక్రమం ఎస్పీ పరిశీలన

వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మెట్ పల్లి పట్టణంలోని వట్టి వాగు వద్ద వినాయక నిమజ్జనాన్ని బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ,సీఐ,ఎస్సైలకు పలు సూచనలు చేశారు. వినాయక శోభాయాత్ర లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నిమజ్జన కార్యక్రమం త్వరగా పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ పి.మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 23:



వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు చేవడుతున్న ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ గురువారం మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతాల్లో చేపడుతున్న భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, ప్రజల రద్దీ నియంత్రణ తదితర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ నమీక్షించారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్ల బ్యారికేడ్లు, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెల్మలపల్లి పాఠశాలలో స్కూల్ యూనిఫాంల పంపిణీ

ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ లక్ష్మణ్ బాబు, సర్పంచ్ బండి స్వామి



మల్హర్, సెప్టెంబర్ 23 ప్రజాకలం ప్రతినిధి.మండల కేంద్రమైన తాడిచర్లలో వెల్మలపల్లి ఎంఫీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఏకరూప దుస్తులు, షూస్, బెల్ట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ బాబు, గ్రామ సర్పంచ్ బండి స్వామి హాజరయ్యారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించిన ఎంఈఓ.. ప్రభుత్వ, ప్రైవేట్ విద్య మధ్య తేడాలను వివరించి, వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలో మరిన్ని అడ్మిషన్లు జరిగేలా చూడాలని కోరారు.సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాల పునఃప్రారంభమై ప్రస్తుతం 26 మంది విద్యార్థులతో కొనసాగడం సంతోషకరమన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం తిరుపతిరెడ్డి, సీఆర్పీలు సమ్మయ్య, సమత, పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు బెజగం సతీష్, హెచ్ఎం ఎన్.సురేష్, గంగరాజు, మధ్యాహ్న భోజన సభ్యురాలు రాజేశ్వరి, స్కావెంజర్ సమ్మక్క, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిన్నెలగూడెంలో ఘనంగా వినాయక నిమజ్జనం

దయాకర్ చారి-లక్ష్మీ ప్రసన్న జ్యూయలరీ ఆధ్వర్యంలో అన్నదానం



ఆళ్లపల్లి, సెప్టెంబరు 23 (ప్రజాకలం) ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామపంచాయతీ పరిధిలోని జిన్నెలగూడెం గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద దయాకర్ చారి-లక్ష్మీ ప్రసన్న జ్యూయలరీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గణనాథుడి నిమజ్జన వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని వేమూరి హరిబాబు-స్వప్న దంపతులు రూ.6,516కు, కలశాన్ని వేమూరి రవి-మమత దంపతులు రూ.4,316కు వేలంపాటలో దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు అంబోజు నవీన్, సభ్యులు అంబోజు సాయి, శ్యాంసుందర్, నిట్ట నిఖిల్, అఖిల్, పోతురాజు సత్యనారాయణ, సాయి, చిట్టిమల్ల యశ్వంత్, ప్రవీణ్, సాత్విక్, చిట్టిమల్ల రమేష్, భిక్షం, నిట్ట వెంకట్రావు, సుధాకర్, వేమూరి సత్యం, వేమూరి నవీన్, అంబోజు సందీప్, నవీన్, రవికుమార్, హరిబాబు, వేమూరి నరసింహారావు, విజయ్‌తో పాటు గ్రామ పెద్దలు చిట్టిమల్ల బాబు, స్థానిక సర్పంచ్ సుతారి రమాదేవి, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్, రెండో వార్డు సభ్యురాలు కెక్కర్ల సునీత, కాంగ్రెస్ మండల నాయకులు సుతారి కృష్ణ, మాజీ జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ (బి) గ్రామంలో వైభవంగా గణేష్ నిమజ్జనం

నిర్మల్, సెప్టెంబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి): కుబీర్ మండలంలోని పార్టీ (బి) గ్రామంలో బుధవారం గణనాథుల నిమజ్జన ఉత్సవం భక్తిశ్రద్ధలు, పండుగ వాతావరణం నడుమ వైభవంగా జరిగింది.



ముందుగా గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. లడ్డూ ప్రసాదం వేలం పాట అనంతరం శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. డీజే శబ్దాలు, డప్పు వాయిద్యాల మధ్య, డ్యాన్సులు చేస్తూ ట్రాక్టర్ ట్రాలీలలో విగ్రహాలను ఊరేగించారు. ఊరేగింపు అనంతరం సమీపంలోని చెరువులో స్వామివారికి వీడ్కోలు పలుకుతూ విగ్రహాలను నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గణేష్ మండలి సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

ఎస్.ఐ.ఆర్-2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 23:

జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్-2026 ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ, విచారణల పురోగతిని సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన విచారణలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అదేవిధంగా ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6 (కొత్త ఓటరు నమోదు), ఫారం-7 (ఓటరు తొలగింపు), ఫారం-8 (ఓటరు వివరాల సవరణ) దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించి, విచారణ లకు వారు హాజరయ్యేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్/ఏఈఆర్ఓ నర్సింగ రావు, అదనపు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్ (ఎం), ఎన్నికల డీటీ తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- 'మహబూబ్‌నగర్ ఫస్ట్' శిక్షణ కేంద్రంలో ఘనంగా గణపతి పూజలు

- హాజరైన ప్రభుత్వ విప్ యెన్నం సతీమణి లక్ష్మీప్రసన్న

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 23:



యువత, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో కూడిన లక్ష్య సాధనతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సతీమణి లిశ్రీమతి యెన్నం లక్ష్మి ప్రసన్న లి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని 'మహబూబ్‌నగర్ ఫస్ట్' శిక్షణ కేంద్రంలో ప్రతిష్ఠించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ కేంద్రానికి విచ్చేసిన ఆమెకు సంస్థ నిర్వాహకులు, అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా, ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, స్వామి వారి సన్నిధిలో కూర్చుని అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పుష్పార్చనలు, శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించే ఆదిదేవుడైన గణనాథుని ఆశీస్సులతో మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉపాధి అవకాశాలనుఅందివుచ్చుకోవాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థినులు, శిక్షకులతో కలిసి ఆమె స్వయంగా కోలాటం ఆడి అందరిలో నూతనోత్సాహాన్ని నింపారు. అనంతరం గణనాథుడిని(మట్టి విగ్రహాన్ని) శిక్షణ పొందుతున్న విద్యార్థులు నృత్యాలు, బాజాభజంత్రీలు, కోలాహలం నడుమ మేళతాళాలతో ఊరేగించి మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో చక్రస్నానం తో నిమజ్జనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, సంస్థ ఇన్‌చార్జి నిజలింగప్ప, అనిల్, శిక్షకులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

- డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్



నిర్మల్ సెప్టెంబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని జిల్లాల్లో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో హైదరాబాదు నుంచి వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ (ఫార్మర్ ఐడీ నమోదు) ప్రక్రియలపై ఇతర ఉన్నతాధికారులతో కలిసి విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. తగినన్ని లారీలు, టార్పాలిన్ లు, గన్నీ సంచులు, హమాలీలు, సామాగ్రి సమకూర్చుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ఏడు రకాల సన్న వరి వడ్లు పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందిస్తామన్నారు. రికార్డుల ప్రకారం 10 లక్షల 50 వేలకు పైగా రైతులు దాదాపు 34 లక్షల 84 వేల ఎకరాల్లో సన్న వరి రకాలు సాగు చేశారని అన్నారు.డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా రైతులకు వ్యవసాయ సంబంధిత అనేక అంశాల్లో ఉపయోగాలు ఉంటాయన్నారు డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణలో గ్రామీణ స్థాయిలో స్థానికంగా వ్యవసాయ అంశాలపై అవగాహన ఉన్న వారిని వాలంటీర్లుగా నియమించుకోవాలని పేర్కొన్నారు.ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వేల వివరాలను జిల్లాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వివరాలను సమీక్షించారు. మిగిలిన రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీసీలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నవితరణ

అన్న ప్రసాద వితరణ చేసిన ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్

గణనాథునికి ఘనంగా పూజలునిర్వహించిన కుటుంబసభ్యులు

ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ శివ శెంకర్ గౌడ

భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తజనం



(నందిగామ సెప్టెంబర్ 26 ప్రజా కలం ప్రతినిధి)నందిగామ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ప్రాంగణంలో నెలకొల్పిన గణనాథుడికి గ్రామ ఉప సర్పంచ్ సార వెంకటేష్ గౌడ్ కుమారుడు సార శ్రీయాన్ష్ జన్మదిన శుభ సందర్భంగా బుధవారం ఆయన కుటుంభ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉప సర్పంచ్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రాసదం విత్తరణ చేశారు.

ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ..నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం పొందడానికి ఆధ్యాత్మిక చింతన ఒక్కటే సరైన మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం. శివశంకర్ గౌడ్,గ్రామ సర్పంచ్ కొమ్ము, నందిగామ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేపల్లె కుమారస్వామి గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎదిరే శ్రీకాంత్ గౌడ్,గ్రామ అధ్యక్షులు కేశమోని రాంచెందర్ యాదవ్, ఎల్లారశీ శేఖర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మండల వార్డు సభ్యుల సంఘం అధ్యక్షుడు సురేష్, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, వార్డు సభ్యులు బొమ్మగల్ల నర్సింములు, చించెట్టి శివకుమార్ గౌడ్, శివగళ్ళ శురేష్, కిట్టు యాదవ్, అగ్గి శురేష్ గౌడ్, నాయకులు అడ్వకేట్ అంజి, యాదవ్,క్రిష్ణ యాదవ్,అభిరామ్ రెడ్డి,మీట్టు చారి,తడకల జంగయ్య, సప్పిడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా భారతి పాఠశాలలో ఆరో వాటర్ ప్యూరిఫై ప్రారంభం

నిర్మల్, సెప్టెంబర్ 24:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని విద్యా భారతి పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ ఆరో వాటర్ ప్యూరిఫై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఆరో వాటర్ ప్యూరిఫై ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల యాజమాన్యం మరో ముఖ్యమైన ముందడుగు వేసిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యమే మా ప్రథమ బాధ్యత – సురక్షితమైన తాగునీరు వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోతన్న, లక్మ మధుసూదన్, కొట్టే ప్రవీణ్, రాజు, సాయినాథ్, దేవేందర్, దేవకి, సరస్వతి, రాణి, శృతిక, పద్మ, నేహా, గంగావేణి, లక్ష్మి, కవిత, గంగామణి, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.



పినపాకలో మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మట్టా దయానంద్ విజయకుమార్

తల్లాడ,సెప్టెంబర్. 23 ప్రజా కలం న్యూస్ తల్లాడ మండలం పినపాక గ్రామంలో సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మరియు శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమలింగేశ్వర స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ నందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, మండల నాయకులు వెంకటనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు , కమిటీ సభ్యులు భక్తులు, గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు



గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

- లింబా కె లో మహిళా సమైఖ్య భవనం , హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ సెప్టెంబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ప్రతి గ్రామానికి అభివృద్ధి పనుల కోసం 60 లక్షల నుండి కోటీ రూపాయల వరకు నిధులు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు.లింబా కె గ్రామం లో 20లక్షల నిధులతో నిర్మించినా మహిళ సమైక్య భవనం, అదే విధంగా హెల్త్ సెంటర్ ప్రారంభం, అదే విధంగా 12 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న అంగన్ వాడి భవన నిర్మాణనికి భూమి పూజ చేసిన సందర్భంగా అయన మాట్లాడారు.. అదే విధంగా లింబా బి గ్రామం లో 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న గోదాం నిర్మాణనికి అయన భూమి పూజ చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి గ్రామానికి పెద్ద మొత్తం లో నిధులు ఇవ్వడం జరిగిందని, ఐక్యంగా ఉండి, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలింది గా సూచించారు.. పది సంవత్సరాల పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా గ్రామాలు అభివృద్ధి లో వెనుక బడ్డాయన్నారు.. **ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు...** అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు లింబా కె, లింబా బి గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. డప్పుచప్పులతో, మహిళలు మంగళ హారతులు, పూలు చల్లుతూ స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు ఇస్తున్న ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి తో పాటు, నాయకులు అధికారులు సర్పంచ్ లు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా
రాథోడ్ రమేష్ బాధ్యతల స్వీకరణ



నిర్మల్ సెప్టెంబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా డీఆర్వో రాథోడ్ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు రాథోడ్ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలనలోని వివిధ అంశాలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై అధికారులు ఆయనకు వివరాలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, సివిల్ సప్లై డీఎస్ఓ రాజేందర్, డీఎం సుధాకర్, ఏఓ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తానూర్ గ్రామంలో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



తానూర్, సెప్టెంబర్ 23 (ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్ గ్రామంలో బుధవారం గణనాథుల నిమజ్జన ఉత్సవం భక్తిశ్రద్ధలు, పండుగ వాతావరణంలో వైభవంగా జరిగింది, ?ముందుగా గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు,లడ్డూ ప్రసాదం వేలం పాట అనంతరం శోభాయాత్రను భక్తిప్రపత్తులతో ప్రారంభించారు,ట్రాక్టర్ ట్రాలీలలో గణనాథుల విగ్రహాలను ఉంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు,డిజే శబ్దాలు, డప్పు వాయిద్యాల మధ్య యువకుల సాంస్కృతిక నృత్యాలు, ప్రదర్శనలతో శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది,ఊరేగింపు అనంతరం సమీపంలోని చెరువులో స్వామివారికి వీడ్కోలు పలుకుతూ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

భారీ పోలీస్ బందోబస్తు... ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముధోల్ సీఐ ఆధ్వర్యంలో తానూర్ ఎస్సై షేక్ జుబేర్ గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు, శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసింది,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుగంధ -మాధవరావు పటేల్, ఆలయ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామ పెద్దలు, వివిధ గణేష్ మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీనగర్ లో
వినాయకునికి కుంకుమార్చన
- వైభవంగా గణనాథుని పూజా కార్యక్రమాలు



తల్లాడ సెప్టెంబర్ 23, ప్రజా కలం న్యూస్ తల్లాడ మండల కేంద్రం శ్రీనగర్ లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమం భక్తుల ఆధ్యాత్మిక సందడితో ఘనంగా జరిగింది. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు కుంకుమార్చనలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు..శ్రీనగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు మండపాన్ని సందర్శించి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ జోనల్ సభ్యులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, ఆ పార్టీ తల్లాడ పట్టణ అధ్యక్షులు జివిఆర్,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్తెనపల్లి కిషోర్ ,యువ నాయకులు కటికి శ్రీకాంత్, నరసింహారావు, పరిసర ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బోసి కర్ర వినాయకుడి ఆలయంలో
ఘనంగా సంతాన ఫలాల పూజలు





తానూర్, సెప్టెంబర్ 23(ప్రజా కలం): మండలం బోసి గ్రామంలోని శ్రీ వరసిద్ధి కర్ర వినాయక ఆలయంలో బుధవారం సంతాన ఫలాల పూజల కార్యక్రమం వైభవంగా జరిగింది. తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, దంపతులు ఈ పూజలో పాల్గొన్నారు. వేద పండితుల చేతుల మీదుగా దంపతులకు సంతాన ఫలాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు తీరొక్క నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నిరాశ్రయ కుటుంబానికి ఆపన్నహస్తం
జ్ఞాన మందిరం ఫౌండేషన్ సహకారంతో క్వింటా సన్నబియ్యం అందజేసిన సులిగిరి తరుణ్



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 23 ప్రజా కలం (ప్రతినిధి):

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామానికి చెందిన నిరాశ్రయ కుటుంబానికి గ్రామ యువకులు, అమ్మానాన్న జ్ఞానమందిరం ఫౌండేషన్ అండగా నిలిచారు. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి తిరిగి స్వగ్రామానికి వచ్చిన అరబ్ గౌస్ మియా, రెహనా దంపతుల కు సొంత ఇల్లు లేక గ్రామ బస్టాండ్ ఆవరణలో చెట్ల కింద ప్లాస్టిక్ కవర్లతో తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని దుర్భర జీవనం సాగిస్తున్నారు. వారి దీనస్థితిని గమనించిన గ్రామ యువకుడు సులిగిరి తరుణ్ విషయాన్ని అమ్మానాన్న జ్ఞానమందిరం ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ ఇరుగజీవ తిరుపతయ్య వంశరాజ్ రూ. 5,500 విలువైన క్వింటా సన్నబియ్యాన్ని అందించేందుకు ముందుకొచ్చారు. వారి సహకారంతో బుధవారం గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో సులి గిరి తరుణ్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కన ప్లాస్టిక్ కవర్లతో జీవిస్తున్న కుటుంబానికి విషసర్పాలు, దోమల బెడదతో పాటు వర్షాల సమయంలో ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. అధికారులు, గ్రామ పాలకులు స్పందించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించాలని కోరారు. నిరాశ్రయ కుటుంబానికి సహాయం అందించిన ఫౌండేషన్‌కు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్నకృష్ణయ్య, గోపాల్, యువకులు మంజునాథ్, పవన్, తేజ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ వినాయక నిమజ్జన శోభాయాత్ర
- కలిశంతో పురవీధులు కలియదిరిగి తల్లాడలో ఘన ఊరేగింపు
- పాల్గొన్న నాయకులు, మహిళలు, చిన్నారులు



తల్లాడ సెప్టెంబర్ 23, ప్రజా కలం న్యూస్

వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా తల్లాడ పట్టణంలో శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో కలశంతో ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. కమిటీ నేతృత్వంలో జరిగిన ఈ శోభాయాత్రలో నాయకులు, మహిళలు,యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంతో ముందుకు సాగారు. దగ్గుల శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు,భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని కలశం తలపై ధరించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు,యువత ఉత్సాహంగా పాల్గొనడంతో పట్టణ వీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది. వినాయకుడి నామస్మరణలు, భక్తుల సందడితో పురవీధులు మార్మోగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో కలశాలను మోస్తూ ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాల నందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో దగ్గుల శ్రీనివాసరెడ్డి,మొక్క కృష్ణార్జున్,మొక్క సత్యనారాయణ, అప్పిరెడ్డి,శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మొక్క నరసింహారావు, అనుమోలు రామకృష్ణ,పెరికె రాము,కొత్తగుళ్ల సత్యనారాయణ, ముత్యాలు,సైదారావు, లక్ష్మణ్ బొగ్గవరపు, రాజారావు,గరిడేపల్లి సత్యం,గరిడేపల్లి రాము,మంజుల కృష్ణ,అనుమోలు వంశీ,బొడ్డు బాలకృష్ణ,రాకేష్, సత్యనారాయణ లచ్చి,గ్రామ పెద్దలు, భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

నవరాత్రి ఉత్సవాలు విజయవంతం
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య
- నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, పోలీసుల నిరంతర పర్యవేక్షణ
- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు



ఖమ్మం, సెప్టెంబరు 23(ప్రజా కలం న్యూస్)

గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు. బుధవారం స్థానిక ముస్తఫానగర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన శోభాయాత్రను పోలీస్ కమిషనర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌళిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది, పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో, గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రంతా, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులు, నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, చిన్నారులు, వృద్ధులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు సహకరించాలని వారు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉత్సవ కమిటీలు, భక్తులు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించడం ద్వారా సోదరభావం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ, మునిసిపల్ అధికారులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ధంసలాపురం చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ డోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసిన దుండేటి వీరారెడ్డి, మర్సకట్ల బాబు



తల్లాడ. సెప్టెంబర్. 23 ప్రజా కలం న్యూస్

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును స్వగ్రామం గండుగలపల్లి లో బుధవారం తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మర్సకట్ల బాబు కలిశారు. ఈ సందర్భంగా సిరిపురం మేజర్ ద్వారా వచ్చే నీటిని వీలైనంత తొందరగా వచ్చేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిరిపురం మేజర్ కాలవ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని త్వరలోనే నీటిని కూడా విడుదల చేస్తామని రైతులు అధైర్య పడొద్దని,ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అని మంత్రి తుమ్మల తెలిపారు. సిరిపురం కాలవనిర్మాణ పనులు జరుగుతున్నందున నీటిని విడుదల చేయడం కొంచెం ఆలస్యమైందని దీన్ని రైతులు కూడా గమనించాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

మట్టమ్మ కుటుంబ సభ్యులతో డాక్టర్ పిడమర్తి రవి
ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్న కుటుంబ సభ్యులు



తల్లాడ సెప్టెంబర్ 23, ప్రజా కలం న్యూస్. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పిడమర్తి రవికి తల్లాడ మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ రమణమ్మ కుటుంబ సభ్యులను, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేమిశెట్టి నాగన్న బుధవారం కలిశారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా, అటుగా వెళుతున్న ఆయన వారి చిరకాల మిత్రులు మట్టమ్మ హోటల్ యాజమాన్యం సరికొండ అప్పలరాజు ను ఆయన కలుసుకొని పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అప్పలరాజు ఆయనను సగౌరవంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆయన తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ తొలి చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్న తన సహాయ సహకారాలు మెండుగా ఉంటాయని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. తల్లాడకు వచ్చిన ఆయనకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా సోదర భావంతో ఉండటంతో ఇరువురు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా హోటల్లో మహిళలందరూ ఆయనకు వినాయక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిశెట్టినాగన్న ఉన్నారు.స్థానిక నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో గణపతి అన్నదానం
ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం
ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ
అన్నదానాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు

తల్లాడ సెప్టెంబర్ 23 ప్రజా కలం న్యూస్ అన్నారుగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ ఉత్సవ కమిటీ యువకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని తల్లాడ మాజీ ఎంపీపీ శ్రీ దొడ్డ శ్రీనివాసరావు ప్రారంభించి,భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా దొడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ గణపతి ఉత్సవాలు భక్తి,ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని, యువత సమిష్టిగా ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,గ్రామ సీనియర్ నాయకులు బొమ్మగాని నాదం, పంచాయతీ సెక్రెటరీ కె వెంకటేశ్వర్లుతో పాటు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బండి నరసింహారావు, దొడ్డ నరేష్,ఫిల్లీ,సాయి యువకులు,గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు. యువకులు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఎంబీబీఎస్ సీటు సాధించిన వై.శ్రీలతకు ఘన సన్మానం



గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ 23 ప్రజా కలం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన ఎంబీబీఎస్ తొలి దశ ఫలితాల్లో మల్దకల్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వై. అమృత్ కుమార్, వై. స్వప్న దంపతుల కుమార్తె వై. శ్రీలత ఎంబీబీఎస్ సీటు సాధించింది.విషయం తెలుసుకున్న దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర సలహాదారుడు, జిల్లా ఉపసర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పాల్వాయి ఎస్. రంజిత్ కుమార్, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్వారం ఎస్. తిరుమలేష్ విద్యార్థిని వై. శ్రీలతను శాలువాతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ము చేయకుండా, అన్నయ్యల ప్రోత్సాహంతో వై. శ్రీలత పట్టుదలతో చదువుకుని పేదరికాన్ని అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థిని భవిష్యత్తులో మరెంతో ఉన్నతమైన స్థాయికి ఎదిగి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు.

(వరంగల్/పర్వతగిరి) సెప్టెంబర్ 23, ప్రజాకలం ప్రతినిధి:

పర్వతగిరి మండల కేంద్రంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా గ్రామంలోని వివిధ గణపతి మండపాలను పర్వతగిరి గ్రామ



సర్పంచ్ చీదురు శంకర్, వార్డు సభ్యులతో కలిసి సందర్శించారు. ఆయా గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చీదురు శంకర్ మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల మాదిరిగానే గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను సురక్షితంగా ముగించుకోవాలని ఆయన కోరారు. గ్రామ ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చింతకుంట్ల అనిత – రమేష్, వార్డు సభ్యులు జంగా రజిత – గంగులు, చిన్నపెల్లి విజయ, బుద్దె పద్మ– కుమారస్వామి, జనగాం వెంకటేశ్వర్లు, రంగు వెంకటేశ్వర్లు కొప్పు రాజు, తుంగ రాజు, బొట్ల వెంకన్న, పుల్లూరి రజినీకాంత్ గౌడ్, ఇస్లావత్ హరీష్, పోకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం.. ప్రజలే కుటుంబం!

ఘనంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్ పుట్టినరోజు వేడుకలు



సెప్టెంబర్ 23 ప్రజాకలం(ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట)

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ, కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్న వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ పుట్టినరోజు వేడుకలు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి దామోదర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్ మాట్లాడుతూ.. ఈగ దామోదర్ తనకు చిన్ననాటి మిత్రుడని, దశాబ్దాలుగా తమ స్నేహబంధం కొనసాగుతోందని గుర్తుచేశారు. చిన్ననాటి నుంచి మృదుస్వభావంతో, అందరినీ కలుపుకొని వెళ్లే వ్యక్తిత్వం దామోదర్ సొంతమన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం అందించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు.రాజకీయ పదవిని ప్రజలకు మరింత చేరువగా సేవ చేసేందుకు ఒక అవకాశంగా భావిస్తూ దామోదర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పేదలు, విద్యార్థులు, నిరుపేద కుటుంబాలు తదితరులకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చొరవ చూపుతున్నారని అన్నారు.

ప్రజలతో నిరంతర అనుసంధానం..కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా పార్టీని పట్టణ స్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని నాయకులు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా మంచి పేరు సంపాదించుకుంటున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.చిన్ననాటి మిత్రుడు డీకొండ యుగేందర్ మాట్లాడుతూ.. తామిద్దరూ ఒకే చోట విద్యాభ్యాసం చేశామని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి ప్రజా జీవితంలో దామోదర్ ఎదుగుతున్న తీరు తమకు గర్వకారణమన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులకు, పట్టణానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నాయకులు, మిత్రులు మాట్లాడుతూ.. ఈగ దామోదర్ సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ ఆయనకు మరింత బాధ్యతను పెంచుతోందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ ప్రజల మధ్య ఉంటూ సేవలు కొనసాగించాలని కోరారు. పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ దొమ్మటి రాజయ్య, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పాపారావు, సీనియర్ నాయకులు ఐత యాకాంతం, అనిమిరెడ్డి రాంచంద్రారెడ్డి, 3వ డివిజన్ అధ్యక్షుడు కొండేటి సుధాకర్, వెంకటనర్సు, ఐత సుధాకర్, కుమారస్వామి, గట్టు శ్రీనివాస్, డీకొండ యుగేందర్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీకాంత్, నందిపాక భాస్కర్, యువ నాయకులు వెంకట్, కొండేటి మధు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయని భక్తి సందడి

స్థానిక సర్పంచ్ పెరికే నాగేశ్వరావు నేతృత్వంలో

తల్లాడలో ఘనంగా కలశం ఊరేగింపు - ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, పిల్లలు



తల్లాడ సెప్టెంబర్ 23, ప్రజా కలం న్యూస్


వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తల్లాడ పట్టణంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు నేతృత్వంలో కలశం ఊరేగింపు కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ వాసులు, వ్యాపారస్తులు, వర్తకులు,మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేశారు.

జోరువానలోనూ జోష్ తగ్గలేదు,

ఊరేగింపు కొనసాగుతున్న సమయంలో జోరుగా వర్షం కురిసినా భక్తులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఉత్సాహంగా ముందుకు సాగారు. కలశాలతో డ్యాన్స్ చేస్తూ,భక్తి గీతాలకు అనుగుణంగా సందడి చేస్తూ ప్రేక్షకులను అలరించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు,పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, వ్యాపారులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడంతో తల్లాడ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.భక్తి, ఉత్సాహం,ఐక్యతకు ప్రతీకగా ఊరేగింపు భక్తి శ్రద్ధలతో సాగిన కలశం ఊరేగింపు ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు,శ్రీనగర్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గురివిందల సుధా నాయుడు,కోడూరి రాము,ఆవతి రామారావు,చిహెచ్. కృష్ణమూర్తి,పసుమర్తి శ్రీనివాసరావు,యూత్ కమిటీ సభ్యులు ప సుమర్తి హరీష్,పెరికే మణిశంకర్,తొండపు తరుణ్,త్రివేణ్, గౌతమ్ వేమిశెట్టి, సోనూ ఎస్.కె.,నవీన్ కొమ్మినేని,మనోజ్ కుమార్ గుర్రం, ఉదయ్,నిమ్మల మనోజ్,హేమంత్, సూర్య,వరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొననున్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం

- అంబర్‌పేట్ ప్రేమ్ నగర్ లో రోడ్డుపై వేలాడుతున్న వైర్లు



అంబర్‌పేట్ సెప్టెంబర్ 23(ప్రజాకలం న్యూస్)

రోడ్లపై స్తంభాలకు సాలెగూడుల్లా అల్లుకున్న నెట్వర్క్ కంపెనీలు, ఇంటర్నెట్ వైర్లతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నా అధికారుల్లో చలనం లేదని స్థానికులు మండిపడుతున్నారు.అంబర్‌పేట్ లోని ప్రేమ్ నగర్ లో కేబుల్ వైర్లను కట్ చేసి తొలగించకపోవడంతో క్రిందికి వేలాడుతూ రోడ్డున పోయే వారికి, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇంటర్నెట్ నెట్వర్క్ కేబుల్ కంపెనీల సిబ్బంది పాత వైర్లను తొలగించి కొత్త వైర్లను వేసే క్రమంలోనూ, మరమ్మతులు చేసే క్రమంలోనూ వైర్లను కట్ చేసి తొలగించకపోవడంతో రోడ్లపై వేలాడుతూ వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలు జరిగిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ విషయంపై ఇటు అధికారులకు గానీ అటు విద్యుత్ శాఖ వారికి కానీ ఫిర్యాదులు చేస్తే పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంటర్నెట్, నెట్వర్క్ కేబుల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జర్నలిస్టులపై దాడి.. ఎస్పీకి వినతిపత్రం

- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజేఎఫ్ డిమాండ్





గద్వాల, సెప్టెంబర్ 23 (ప్రజా కలం):

గద్వాల రూరల్ పరిధిలోని సంఘాల చెరువు సమీపంలో రిపోర్టర్ నర్సింహులుపై జరిగిన దాడిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.

దాడిలో గాయపడిన జర్నలిస్ట్ నర్సింహులును టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసి ఘటనపై వినతిపత్రం అందజేశారు.జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అధ్యక్షుడు బి. గిరిబాబు ఎస్పీని కోరారు.

ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజా సమస్యలను, వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తిస్తున్నారని అన్నారు. వార్తలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వాస్తవాలను తెలుసుకుని చట్టబద్ధమైన మార్గాల్లో స్పందించాలని, జర్నలిస్టులను బెదిరించడం లేదా దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు.

జిల్లాలో జర్నలిస్టుల విధులు నిర్వహించే సమయంలో వారికి రక్షణ కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు సురేష్, శ్రీనివాసులు, కేబీ తిమ్మప్ప, టి. వీరన్న, మహబూబ్, వరప్రసాద్, ఇలియాస్, విష్ణువర్ధన్ గౌడ్, సత్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

-పోలకమ్మ చెరువు వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్

(వరంగల్/పర్వతగిరి)సెప్టెంబర్ 23, ప్రజాకలం ప్రతినిధి

పర్వతగిరి పరిధిలోని పోలకమ్మ చెరువు వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించనున్న ప్రాంతాన్ని పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేశ్ విగ్రహాల ఊరేగింపులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సంబంధిత సిబ్బందితో చర్చించారు. నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, విద్యుత్, పారిశుధ్యం, తాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరిగేలా పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత



గ్రామ జిపిఓ కార్యదర్శి అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో భక్తుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు లైన్మెన్, గ్రామపంచాయతీ కార్యదర్శి రఘు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షంలోనూ కొనసాగిన

గణనాథుని నిమజ్జన వేడుకలు

అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 23 (ప్రజా కలం)

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో గణనాథుని నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. భారీ వర్షంలోను కూడా భక్తులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఉత్సాహంగా నిమజ్జన శోభాయాత్రల్లో పాల్గొంటున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు, యువత, భక్తులు హుషారైన పాటలకు నృత్యాలు చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణంలో ఎంజాయ్ చేస్తున్నారు. ఇకపోతే జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తాకు చేరుకున్న వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తుండగా, కొందరు మహిళలు వర్షానికి సంబంధించిన సినిమా పాటలపై నృత్యాలు చేస్తుండగా వీక్షకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కురుస్తున్న భారీ వర్షంలో కొనసాగుతున్న నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యంగా ఆయా చెరువుల వద్ద గల బతుకమ్మ ఘాట్ ల వద్ద పోలీస్ అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చెరువు వద్దకు చేరుకున్న మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు.

ముళ్ల పొదలను తొలగించిన సర్పంచ్ రాకేష్

ఐనవోలు, సెప్టెంబర్ 23:– (ప్రజాకలం ప్రతినిధి)

ఐనవోలు మండలం పెరుమాండ్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని



పెరుమాండ్లగూడెం నుంచి ఐనవోలు వెళ్లే ప్రధాన రహదారిపై పెరిగిన ముళ్ల పొదలను గ్రామ సర్పంచ్ దుప్పెల్లి రాకేష్ జేసీబీ సహాయంతో తొలగించారు. రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు వాహనదారులు, గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సర్పంచ్ రాకేష్ వెంటనే స్పందించి ముళ్ల పొదలను తొలగించే చర్యలు చేపట్టారు.గ్రామ ప్రజల సౌకర్యం, రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ముళ్ల పొదలు తొలగించడంతో రహదారి మరింత సౌకర్యవంతంగా మారిందని గ్రామస్థులు తెలిపారు.

కల్లెడ పిఎసిఎస్ చైర్మన్ గా పిన్నింటి అనిల్ ప్రమాణ స్వీకారం



(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 23, ప్రజాకలం ప్రతినిధి:

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు బుధవారం పర్వతగిరి మండలం కల్లెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) నూతన చైర్మన్గా పిన్నింటి అనిల్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా అనిల్ రావుకు పలువురు నాయకులు శాలువాతో సత్కరించి, బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫాక్స్ చైర్మన్ అనిల్ రావు తన చేతుల మీదుగా ఫ్యాక్స్ డైరెక్టర్ గుగులోతు సుధాకర్ కు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పిఎసిఎస్ చైర్మన్ అనిల్ రావుని నాయకులు ఘనంగా సన్మానించి రైతులకు సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఫ్యాక్స్ చైర్మన్ అనిల్ రావు మాట్లాడుతూ, నన్ను ఫాక్స్ చైర్మన్గా ఎన్నుకున్నందుకు డైరెక్టర్లకు, రైతులకు, నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకవర్గం ఏ విధంగా పనిచేశారో, అంతకంటే బాగా పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు గుగులోతు భాస్కర్, గుగులోతు యాకూబ్, భూక్య కిషన్, శ్రీనివాస్, రవి, బాలాజీ, విజేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం లో పోషణ్ మహా ప్రోగ్రాం

- పాల్గొన్న సూపర్వైజర్ అంజమ్మ

వాజేడు సెప్టెంబర్ 22 (ప్రజాకలం) మండల పరిధిలోని ధర్మవరం అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ అంజమ్మ అధ్యక్షతన పోషన్ మహా ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ అంజమ్మ మాట్లాడుతూ తల్లులకు, కిషోర్ బాలికలకు పోషకాహారం గురించి వివరంగా తెలియజేశారు.బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి కూడా తెలియజేశారు. పిల్లలకు జంక్ ఫుడ్ ను దూరంగా ఉంచి మంచి పోషకాలు ఉన్నటువంటి ఆహారాలను అందించాలని తల్లులకు సూచించారు. తక్కువ ఖర్చుతో దొరికే పోషకాహారాలు ఉన్న పదార్థాలు తినడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మి, అంగన్వాడి టీచర్లు సమ్మక్క, సుజాత, పార్వతి, స్వరూప, వెంకటలక్ష్మి, కృపావతి, శకుంతల, అంగన్వాడి ఆయాలు, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.



అంకాపూర్‌లో కట్టె గణపతికి సిపి సాయి చైతన్య ప్రత్యేక పూజలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 23:

మారుతున్న కాలంలోనూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పేర్కొన్నారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకాపూర్ గ్రామంలో లచ్చ గౌడ్ మరియు వీడీసీ ఫంక్షన్ హాల్‌లో హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కట్టె గణపతి విగ్రహాన్ని బుధవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి కమిషనర్ ప్రత్యేక పూజలు



నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సిపి మాట్లాడారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని, ప్రజలందరూ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. నవరాత్రి వేడుకలు సమాజంలో సోదరభావం, ఐక్యతను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్, అంకాపూర్ సర్పంచ్ దేవేందర్, హిందూ సేవా సమితి ప్రతినిధులు బుర్రన్న, రాజన్న, రమణారెడ్డి, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్‌లో అమానుషం

- 49 కుటుంబాలపై సాంఘిక బహిష్కరణ

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌కు బాధిత గౌడ, ఎస్సీ కుటుంబాల ఫిర్యాదు

- మాట్లాడితే రూ. 25 వేల జరిమానా అంటూ వీడీసీ హుకుం



నిజామాబాద్, సెప్టెంబరు 23: (ప్రజా కలం ప్రతినిధి)

నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్ గ్రామంలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) అరాచకం కలకలం రేపింది. గ్రామానికి చెందిన 39 గౌడ (కల్లుగీత కార్మిక) కుటుంబాలతో పాటు 10 ఎస్సీ కుటుంబాలపై వీడీసీ సభ్యులు సాంఘిక బహిష్కరణ విధించారు. ఈ అమానుష ఘటనపై తీవ్ర భయాందోళనలకు గురైన బాధిత కుటుంబాలు బుధవారం నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తరలివచ్చి సీపీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాయి. వీడీసీ పేరుతో కొందరు చేస్తున్న అరాచకాలను అణచివేసి, తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నాయి. రూ. 25 వేల జరిమానా ఆంక్షలు బాధితుల కథనం ప్రకారం.. ఈ నెల 22న గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) అత్యవసరంగా సమావేశమై ఈ 49 కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ గ్రామంలో ఇలా బహిష్కరణ వేటు వేయడం ఇది రెండోసారి. నిన్నటి నుంచి బహిష్కృత కుటుంబాలకు గ్రామస్థులెవరూ సహాయ నిరాకరణ చేయాలని, వారితో ఎవరూ మాట్లాడకూ డదని ఆంక్షలు పెట్టారు. ఆయా కుటుంబాలకు కిరాణా దుకాణాల్లో నిత్యావసర సరుకులు, పాలు కూడా ఇవ్వద్దని వీడీసీ హుకుం జారీ చేసింది. ఎవరైనా ఈ ఆంక్షలను ధిక్కరించి బాధితులతో మాట్లాడినా, సరుకులు విక్రయించినా వారికి రూ. 25,000 భారీ జరిమానా విధిస్తామని వీడీసీ హెచ్చరించింది.

ప్రాణభయంతో ఉన్నాం

గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏ క్షణమైనా తమ ఇళ్లపై దాడులు చేసే అవకాశం ఉందని, ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని బాధితులు పోలీస్ కమిషనర్ ఎదుట వాపోయారు. ఈ బహిష్కరణకు వీడీసీతో పాటు గ్రామానికి చెందిన ఆవుల దేవన్న, ఇట్టేడి రాజకుమార్ రెడ్డి, నాగులపల్లి అంజిరెడ్డి, క్యాతం దేవేందర్, క్యాతం గంగాధర్, తుమ్మల ఆనంద్, తమ్మడి రాజేష్, పోతుగంటి ఊషన్న తదితరులు ప్రధాన కారకులని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాళ్లరాంపూర్ కల్లుగీత కార్మిక సంఘం, బాధిత గౌడ, ఎస్సీ కుటుంబాలు డిమాండ్ చేశాయి.



రూ.5,000 కోట్ల ఎయుఎం దాటిన బరోడా బీఎన్‌పీ పరిబాస్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్

8వ వార్షికోత్సవానికి చేరువలో కీలక మైలురాయి

Baroda BNP PARIBAS ASSET MANAGEMENT

ముంబయి, సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి)

బరోడా బీఎన్‌పీ పరిబాస్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఎయుఎం) రూ. 5,000 కోట్ల మైలురాయిని దాటింది. ఎనిమిదో వార్షికోత్సవానికి చేరువవుతున్న సమయంలో ఈ మైలురాయిని సాధించినట్లు సంస్థ వెల్లడించింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడుల కేటాయింపును మార్చే విధానంతో ఈ పథకం కొనసాగుతోందని తెలిపింది.

బెంచ్‌మార్క్‌ను మించిన రాబడులు

పథకం ప్రారంభం నుంచి వివిధ కాలవ్యవధుల్లో తన బెంచ్‌మార్క్ అయిన నిఫ్టీ 50 హైబ్రిడ్ కాంపోజిట్ డెట్ 50:50 ఇండెక్స్‌తో పోలిస్తే అధిక రాబడులు అందించినట్లు సంస్థ పేర్కొంది. రెగ్యులర్ ప్లాన్‌లో ఏడాది కాలానికి 10.31%, మూడేళ్లకు 12.37%, ఐదేళ్లకు 10.67%, ప్రారంభం నుంచి 13.2% చొప్పున వార్షిక రాబడి నమోదైనట్లు తెలిపింది. ఇదే కాలాల్లో బెంచ్‌మార్క్ రాబడులు వరుసగా 1.37%, 7.65%, 7.05%, 10.21%గా ఉన్నాయని వెల్లడించింది.

రూ. 1 లక్ష రూ. 2.62 లక్షలుగా..

పథకం ప్రారంభ సమయంలో రూ. 1 లక్ష పెట్టుబడి చేసి ఉంటే, 2026 ఆగస్టు చివరి నాటికి దాని విలువ రూ. 2,62,961కు చేరేదని సంస్థ తెలిపింది. ప్రారంభం నుంచి నెలకు రూ. 10,000 చొప్పున ఎస్ఐపీ చేసిన పెట్టుబడిదారుడి పెట్టుబడి కూడా అదే సమయానికి రూ. 15.42 లక్షలకు చేరేదని పేర్కొంది.

మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేటాయింపులు

ఫండ్ మల్టీ-ఫ్యాక్టర్ అసెట్ అలోకేషన్ మోడల్ ఆధారంగా నికర ఈక్విటీ కేటాయింపును 30% నుంచి 100% వరకు మార్చుకుంటుంది.

వాల్యుయేషన్ సహా వివిధ మార్కెట్ పరామితులను పరిగణనలోకి తీసుకుని ఈక్విటీ, డెట్ మధ్య కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటున్నట్లు సంస్థ వివరించింది.

మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు ప్రతికూల పరిస్థితుల్లో నష్టాలను నియంత్రించేందుకు రంగాలు, మార్కెట్ క్యాపిటలైజేషన్, డెట్ పోర్ట్‌ఫోలియో వ్యవధి వంటి అంశాల ఆధారంగా పెట్టుబడులను చురుకుగా నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

ఈక్విటీలో 80.6% పెట్టుబడి

2026 ఆగస్టు చివరి నాటికి పథకం ఆస్తుల్లో 80.6% ఈక్విటీలో ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. ఈక్విటీ కేటాయింపులో 67.7% లార్జ్‌క్యాప్, 24.6% మిడ్‌క్యాప్, 7.7% స్మాల్‌క్యాప్ షేర్లలో ఉన్నట్లు తెలిపింది. మిగిలిన పెట్టుబడులను డెట్, నగదు, ఇతర ఆస్తుల్లో కేటాయించినట్లు పేర్కొంది.

డెట్ విభాగంలో 48.8% సార్వభౌమ, అత్యధిక క్రెడిట్ రేటింగ్ కలిగిన సాధనాల్లో, 36.3% నగదు, నగదుకు సమానమైన సాధనాల్లో, 15% ఏఏ/ఏఏం రేటింగ్ కలిగిన సాధనాల్లో పెట్టుబడులు ఉన్నట్లు వివరించింది.

రూ.500తో ఎస్ఐపీ

పెట్టుబడిదారులు కనీసం రూ.5,000తో లంప్‌సమ్ పెట్టుబడి, నెలకు రూ.500తో ఎస్ఐపీ ప్రారంభించవచ్చని సంస్థ తెలిపింది. ఏడాదిలోపు పెట్టుబడిలో 10% కంటే తక్కువ మొత్తాన్ని ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ వర్తించదని పేర్కొంది. పథకం ఈక్విటీ కేటాయింపును జితేంద్ర శ్రీరామ్, కుషాంత్ అరోరా, నీరజ్ సక్సేనా, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ కేటాయింపును ప్రశాంత్ పింపుల్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

గమనిక: మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్కుకు లోబడి ఉంటాయి. గత పనితీరు భవిష్యత్తు రాబడులకు హామీ కాదు.

రక్షణ,వెల్ఫేర్ లేని అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఎందుకు...?

- న్యాయవాదుల వెల్ఫేర్ చాప్టర్ తొలగింపులో మతలబ్ ఏమిటి..?

- న్యాయవాద బార్ అసోసియేషన్ లీడర్ల అత్యుచ్చాహం

- జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్,హెల్త్ కార్డ్ కొరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా రమణారావు డిమాండ్....

హైద్రాబాద్ సెప్టెంబర్ 23 (ప్రజాకలం న్యూస్)

దశాబ్దాలుగా కొట్లాడి తెచ్చుకున్న న్యాయవాదుల రక్షణచట్టం ఏమాత్రం లబ్ది చేకూరేదిగా లేదని సీనియర్ న్యాయవాది జిల్లా రమణారావు అభిప్రాయ పడ్డారు ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీ నిమిత్తం ఆగమేగాల మీద ఏర్పాటు చేసిన చట్టంలా కనిపిస్తుంది తప్ప రక్షణ, వెల్ఫేర్ ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం ఏర్పాటు కాబడ్డ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఉద్దేశం మంచిదే అయినా దాని ఫలితం శూన్యం అనేచెప్పలన్నారు. పేరుకు మాత్రం రక్షణచట్టం న్యాయవాదులపై దాడి జరిగితే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ 2026 ప్రకారం ఎఫ్ఐఆర్ చేయమంటే పోలీస్ ఉన్నతాధికారులు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ 2026 చట్టాన్ని బుట్టదాఖలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆగస్టు 9, 2026 న నరేష్ రెడ్డి అడ్వకేట్ వై రంగారెడ్డి జిల్లా కోర్టు లైఫ్ మెంబర్ పై దుండగులు జీడిమెట్లలో నరేష్ దాడిచేసి తలమీద బలంగా కొట్టడం వలన తలకు తీవ్ర గాయం అయ్యింది. ఈ విషయంపై జీడిమెట్ల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ను కలిసి దాడిచేసిన వారిపై అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టాలని అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ 2026 కింద కేసు బుక్ చేయమంటే వారు తోసిపుచ్చారు కావున న్యాయవాదులకు రక్షణ చట్టం వచ్చినప్పటికీ దాని ఫలితం లేదన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టంతో పాటు, న్యాయవాదుల వెల్ఫేర్ కూడా చాలా ముఖ్యం అన్నారు.ఐతే న్యాయవాదుల రక్షణ చట్టం డ్రాఫ్ట్ బిల్లులో న్యాయవాదుల వెల్ఫేర్ గురించి ఒక చాప్టర్ పెడుతున్నారు అని తెలిసినపుడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు సంతోషించారు, కానీ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ 2026 లో న్యాయవాదుల వెల్ఫేర్ చాప్టర్ ను తొలగించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ న్యాయవాదులకు 2014 నుండి స్టైఫండ్ లేదు,2018 తర్వాత ఎన్రోల్ అయిన న్యాయవాదులకు హెల్త్ కార్డ్ లేక చాలామంది జూనియర్ న్యాయవాదులు అనారోగ్యంతో బాధపడుతు న్నారు, కొంతమంది చనిపోయారు దీనికంతటికి కారణం బడ్జెట్ లేకపోవడం ఇదే న్యాయవాదుల రక్షణ చట్టం 2026 లో వెల్ఫేర్ చాప్టర్ ఉండిఉంటే సుమారు 300 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల వెల్ఫేర్ కొరకు కేటాయించేదని గుర్తు చేశారు. దీనంతటికి కారణం మన న్యాయవాద బార్ అసోసియేషన్ లీడర్ల అతి ఉచ్చాహం మాత్రమే,ఈ విషయంపై



దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి న్యాయవాదుల సమస్యల మీద అసెంబ్లీలో ప్రస్తావించినప్పుడు న్యాయవాదుల రక్షణచట్టం న్యాయవాదుల వెల్ఫేర్ కు సుమారు 300 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే విదంగా ప్రయత్నం చేస్తానని చెప్పారు. అత్తాపూర్ పోలీసులు న్యాయవాదులపై చేసిన దాడికి నిరసనగా గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపనున్నట్లు జిల్లా రమణారావు పేర్కొన్నారు. కొత్తగా ఎలెక్ట్ అయిన బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మన్/మెంబర్స్ వారు తక్షణమే జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్,హెల్త్ కార్డ్ కొరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్,హెల్త్ కార్డ్ వెంటనే కల్పించాలని రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది జిల్లా రమణారావు డిమాండ్ చేశారు.

చే నెంబర్ ఫ్లైఓర్ కు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి

సిపిఎం నాయకులు మహేందర్

అంబర్‌పేట్ సెప్టెంబర్ 23(ప్రజాకలం న్యూస్)

చే నెంబర్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహం నూతనంగా ఏర్పాటు చేసిన వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు సిపిఎం నాయకులు మహేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 26వ తేదీన చాకలి ఐలమ్మ 131 వ జయంతి సందర్భంగా భారీగా ఏర్పాటు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సిపిఎం నాయకులు మహేందర్ విగ్రహ ఏర్పాట్లు అదేవిధంగా ఫ్లైఓవర్ కి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని కోరారు. నవ యువక రజక సంఘం అధ్యక్షులు రాజేష్,సంతోష్, మరి కొంతమంది సభ్యులు రజక వృత్తిదారుల సంఘం నగర కార్యదర్శి గోపాల్ సోమయ్య,సాయి రామ్,మహేష్, కన్నా,గణేష్, బాబు,ఈశ్వర్, రాజశేఖర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు





ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోపోతే వ్యవసాయ శాఖ పథకాలు వర్తించవు,

గడువు ముగిసేలోపు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి

-మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గేశ్వరి

బొమ్మాలరామారం, సెప్టెంబర్ 23 (ప్రజా కలం)

ప్రభుత్వ పథకాలు పొందేందుకు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గేశ్వరి అన్నారు బుధవారం రోజున మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ శాఖ సమావేశంలో దుర్గేశ్వరి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు గుర్తింపు కార్డ్ చేయించుకోవాలి అని అన్నారు ఎవరైతే రైతు గుర్తింపు కార్డ్ చేసుకోలేదో వారికి ఈ పథకాలు వర్తించవు అని అన్నారు రైతు భరోసా, ఎరువులు,పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తించవు అని అన్నారు కావున వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు తేది: 30-09-2026 లోపు గడువు వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బుధవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు జవీ=ఖీ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. బచ్చు రమేష్ కి రూ. 60,000

డెఱంగుల లక్ష్మి రూ. 45,000

మహ్మద్ చాంద్ పాషాకి రూ. 60,000

దూసకంటి విజయ లక్ష్మికి రూ. 60,000

కె.సీతామహాలక్ష్మికి రూ. 60,000, కట్కోజ్వాలా రత్నాకర్ రూ. 60,000

బాడిగ రవి చంద్రశేఖర్ రూ 32,500

పి.విష్ణువర్ధన్ రెడ్డికి రూ. 60,000



గొల్ల జనార్దన్ కి రూ 40,000 అందజేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు బుదాల అమర్ బాబు, డీసీసీ ఉపాధ్యక్షులు బయ్యని శివకుమార్, సెక్రటరీలు గణేష్, సంతోష్ ముదిరాజ్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు జలీల్ ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేకు శ్రీనివాస్, బోయిని వెంకటేష్, శ్రీధర్ వర్మ, చంద్రకళ, మధుసూదన్ రెడ్డి, అంజిరెడ్డి, సోము, శ్యామ్, కుత్బుల్లాపూర్ సేవాదళ్ అధ్యక్షులు అజామ్, షైక్ ఇబ్రహీమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా సిద్ధి వినాయక నిమజ్జనోత్సవం

108 కలశాలతో మహిళల శోభాయాత్ర..

భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి:23 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):
సిద్ధిపేట పట్టణంలో గణేష్ నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సిద్ధి వినాయక స్వామి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సెప్టెంబర్



14న ప్రారంభమైన ఉత్సవాలు 22వ తేదీ వరకు కొనసాగాయి. బుధవారం సిద్ధి వినాయక స్వామికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భాగంగా 108 మంది మహిళలు 108 కలశాలతో శోభాయాత్రగా గణేష్ నగర్ పురవీధుల్లో భక్తి గీతాలు, భజనలతో సాగుతూ సిద్ధి వినాయక నామస్మరణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోనే స్వామివారి నిమజ్జనం నిర్వహించారు.ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పర్యావరణహితంగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి, వీలైన చోట్ల సంప్రదాయ పద్ధతిలో నిమజ్జనాలు నిర్వహించే విధానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని భక్తులు కోరారు.ఉత్సవాల్లో భాగంగా 18వ తేదీన సామూహిక కుంకుమార్చన, 20వ తేదీన ఉదయం 10 గంటలకు గణపతి హోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.నిమజ్జనోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు,మహిళా సభ్యులు,గణేష్ నగర్ మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రజకుల హక్కుల కోసం ఐక్యంగా కదలాలి

4వ మహాసభను విజయవంతం చేయాలి...

రాయపోలు మండల నూతన కమిటీ ఏర్పాటు.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 23.
రజక కులవృత్తిదారుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక





పిలుపునిచ్చారు. రాయపోలు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో త్వరలో సిద్దిపేట జిల్లాలో జరగనున్న సమితి 4వ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు చింతకింది కర్ణాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు పాల్గొన్నారు. అనంతరం రాయపోలు మండల నూతన కమిటీని ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షుడిగా వడ్లకొండ భిక్షపతి, యూత్ అధ్యక్షుడిగా చాకలి రాము, ఉపాధ్యక్షులుగా చెప్యాల్ స్వామి, తిమ్మరాజు నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్. కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పరికిబండ మల్లేశం, కార్యదర్శిగా నవీన్, సంయుక్త కార్యదర్శిగా రాచకొండ రవి, కోశాధికారిగా పీర్లపల్లి సాయికుమార్, మండల ఇన్‌చార్జిగా వడ్లకొండ నర్సింలు, కన్వీనర్‌గా కొట్టాల నర్సింలును నియమించారు. నూతన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు.

సేవా స్ఫూర్తికి గౌరవ డాక్టరేట్.

జ్యోతిష్యం, ఆధ్యాత్మికం, సామాజిక సేవలకు గుర్తింపు.



దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 23:
జ్యోతిష్య శాస్త్రం, ఆధ్యాత్మికం, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ సుజాత పంతకానికి గౌరవ డాక్టరేట్ లభించింది. యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పాండిచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆమె ఈ గౌరవాన్ని అందుకున్నారు. వరంగల్‌లో జన్మించిన సుజాత పంతకాని పదేళ్లకు పైగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రాజస్థాన్, కర్ణాటకతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతిష్య శాస్త్రంలో ప్రశ్న తంత్ర, శకున, సంఖ్యా శాస్త్రాలను అభ్యసించి సేవలందిస్తున్నారు. జ్యోతిష్యరత్న పురస్కారాన్ని కూడా అందుకున్నారు. డిమెన్షియా బాధితుల సంరక్షకులకు సంబంధించి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలోనూ పాల్గొన్నారు. గౌరవ డాక్టరేట్ మరింత బాధ్యతతో సమాజ సేవ చేసేందుకు ప్రేరణనిచ్చిందని సుజాత పంతకాని తెలిపారు.

వెల్ డన్ బండారు యాదగిరి ..!

జర్నలిస్టుల రక్తదాన శిబిరం ఈజ్ గ్రేట్ .

అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

శాలువాతో సత్కారం - ప్రశంసా పత్రం అందజేత.



సంగారెడ్డి ప్రతినిధి
సెప్టెంబర్ 23(ప్రజా కలం):
వెల్ డన్ యాదగిరి.. గుడ్ జాబ్ అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు. నేనే మీకు శాలువా కప్పాలి అంటూ శాలువాతో సత్కరించారు. రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని యాదగిరి కి అందజేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (TUWJ- IJU) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదిన పురస్కరించుకొని మంగళవారం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొనాల్సి ఉన్నది. అత్యవసర పనుల వల్ల ఆయన పాల్గొనలేకపోయారు. దీంతో బుధవారం నాడు జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను కలిశారు. నోట పుస్తకాలను అందించారు. రక్తదాన శిబిరం ద్వారా సమాజానికి సేవా నిరతి ని చాటి చెప్పడం గ్రేట్ అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి మెసేజ్ వెళుతుందని అన్నారు. పుట్టినరోజునాడు కేక్ కటింగ్ తో వేడుకలు జరపకుండా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిత్యం సమాజంలోని వార్తలను వెలికి తీస్తున్న జర్నలిస్టుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు జరగడం మరింత శుభ సూచకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా TUWJ IJU సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ తమ యూనియన్ మొదటి నుంచి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే పైనల్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులను సాధించడానికి అనేక పోరాటాలు చేశామని వివరించారు. మన్మందు కూడా తమవంతుగా సామాజిక సేవలో పాల్గొంటామని ఈ సందర్భంగా యాదగిరి పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) విజయలక్ష్మి కూడా ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని అభినందించారు. రక్తదానం ద్వారా ప్రమాదంలో ఉన్న వారికి మేలు కలుగుతుందన్నారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచిదన్నారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, చిన్నా మధ్యతరగతి పత్రికల సంఘం ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, ఆంధ్రజ్యోతి శ్రీకాంత్, టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్షాన్, విజయ రాజు, మహేష్ ,శ్రీకాంత్, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి దయాకర్ ను కల్సిన ముంబై తెలంగాణ జాక్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 23:
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన కార్యకర్తలందరినీ తెలంగాణ ప్రభుత్వం “ఉద్యమకారులుగా గుర్తించాలని” ప్రభుత్వం విప్, కేకే కమిటి సభ్యులు ఎం.ఎల్.సి అద్దంకి దయాకర్ గారికి ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసి) విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం హైద్రాబాద్ లోని ఐటీసీ కోహినూర్ హోటల్లో ఎంటిజెఏసి ప్రతినిధులు కలశారు. మొదట అద్దంకి దంపతులకు సీనియర్ జర్నలిస్ట్ సిర్పా గంగాధర్, కట్ల నర్సింహ గార్లు పంచశీల ఖండువాలు కప్పి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ మహారాష్ట్ర గుజరాత్ రాష్ట్రాల్లోని ఉద్యమకారుల్ని గుర్తించడానికి అక్టోబర్ 4న ముంబైలో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిందని, ఆ సమావేశంలో హర్షత గల ఉద్యమకారులను గుర్తించడానికి ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఐతే తమ సభ్యులందరికీ తెలియజేయాల్సిందిగా చెప్పారు. జైభీం జై తెలంగాణ అంటూ వీడుకోలు పలికారు. ఈ సమావేశంలో ఎంటిజెఏసి తెలంగాణ ముంబై కో-ఆర్డినేటర్స్ సాక్షి మహారాష్ట్ర మాజీ ఎడిటర్ సిర్ప గంగాధర్, కట్ల నర్సింహ, రసీద్ దూదేకుల, సి.ఎచ్ గణేష్ ముదిరాజ్, ఉద్యమకారులైన సామ్రాట్ అశోక్, ఇత్వార్పేట్ లింగం, జర్నలిస్టులైన అంగుళి మాల, మామిడి రాజు, మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.



సర్పంచ్ నవీన్ కు మర్యాదపూర్వకంగా కలిసిన నాయి బ్రాహ్మణులు సంఘం సమస్యల గురించి సర్పంచికి తెలియజేసిన గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ నాయి

మహేశ్వరం సెప్టెంబర్ 23,(ప్రజా కలం)
మహేశ్వరం మండల కేంద్రంలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా మహేశ్వరం గ్రామ కమిటీ ఎన్నికైన శుభ సందర్భంగా మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో



సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ నాయి బ్రాహ్మణులు మాట్లాడుతూ, గ్రామంలో యూనియన్ సమస్యల గురించి అలాగే నాయి బ్రాహ్మణ సంఘం కు స్థలం కేటాయించాలని యూనియన్ సమస్యల గురించి సర్పంచ్ మునగపాటి నవీన్ కు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దూసకంటి ప్రభాకర్ నాయి , మండల ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల శివకుమార్ నాయి , గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ నాయి, ఉపాధ్యక్షుడు శంకర్ నాయి, సత్తయ్య నాయి, రాజు నాయి,బిఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షులు మహేందర్ నాయి,బబ్లు నాయి, శివ నాయి, మహేష్ నాయి, సురేష్ నాయి, సాయినాథ్ నాయి, పరమేష్ నాయి, బాలేష్ నాయి, కుమార్ నాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి అభినందనలు

గజ్వేల్: 23 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)
వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లుగానే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని కూడా శాంతియుతంగా,క్రమశిక్షణతో, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిర్వహించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్



కార్ పద్మాబాయి నర్సింగ్‌రావు కోరారు.గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆమె మాట్లాడుతూ,గత 15 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ,సంప్రదాయాలను కాపాడే విధంగా గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.నవరాత్రుల సందర్భంగా భక్తులు,యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని పూజలు,భజనలు,వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.విఘ్నాలను తొలగించే దేవుడిగా,జ్ఞానం,శుభానికి ప్రతీకగా శ్రీ గణేశుడిని కొలుస్తామని, ఆయన ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన సమయంలో అధికారులు సూచించిన నిబంధనలను పాటిస్తూ, ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ప్రజలంతా ఐక్యత,సోదరభావం,పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శ్రీ గణేశుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం,శాంతి,ఐశ్వర్యం, విజయాలు నిండాలని కోరుతూ,గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు,యువత, మహిళలు, భక్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వెలికట్టలో కొనసాగుతున్న ఎంజాయ్‌మెంట్ సర్వే

నాలుగు బృందాలుగా

సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

గజ్వేల్ నియోజకవర్గం:23 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం వెలికట్ట రవీంద్రనగర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 271లో ఎంజాయ్‌మెంట్ సర్వే మూడో రోజు కొనసాగింది.ఈ సర్వే పరిధిలోని 327.9 ఎకరాల భూమికి సంబంధించి అనుభవదారులైన మొత్తం 118 మంది రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు పంపిణీ చేశారు.డీఐ సేవియా నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి బుధవారం సర్వే నిర్వహించారు.ఇందులో భాగంగా 30 మంది రైతులకు సంబంధించిన 61 ఎకరాల 18 గుంటల భూమిలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టారు.నోటీసులు అందుకున్న రైతులు తమ తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. ఎంజాయ్‌మెంట్ సర్వే నాలుగో రోజు గురువారం కూడా యథావిధిగా కొనసాగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కొండపాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,జీపీఓల బృందం పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అబ్జర్వర్లుగా గజ్జల రాంచందర్, నందిగామ నర్సింహ

మహేశ్వరం, సెప్టెంబర్ 23 (ప్రజా కలం):
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అబ్జర్వర్లుగా రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్‌చైర్మన్, మాజీ కార్పొరేటర్ గజ్జల రాంచందర్, నందిగామ నర్సింహ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం నియోజకవర్గంలోని దళితుల సమస్యలు, ఎస్సీ వర్గాల సంక్షేమం, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు. దళితుల అభ్యున్నతికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై



చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గజ్జల రాంచందర్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని దళితుల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్‌కు గజ్జల రాంచందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దళితుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని గజ్జల రాంచందర్, నందిగామ నర్సింహ తెలిపారు.

కల్వకోల్‌లో రూ.51 వేలకు లడ్డుని కైవసం

-గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ కుమారుడు బక్కని రవి మాదిగ



మహేశ్వరం, సెప్టెంబర్ 23, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడి వద్ద లడ్డూ వేలం పాటను ఘనంగా నిర్వహించారు. వినాయకుడి ఉత్సవాల్లో



భాగంగా నిర్వహించిన ఈ వేలం పాటకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. వేలం పాట ప్రారంభం నుంచి లడ్డూను దక్కించుకునేందుకు పలువురు ఆసక్తి చూపడంతో కార్యక్రమం ఉత్కంఠభరితంగా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ కుమారుడు బక్కని రవి మాదిగ వేలం పాటలో పాల్గొని రూ.51,000లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. వేలం పాటలో చివరి వరకు పోటీ కొనసాగగా, రూ.51 వేలతో రవి మాదిగ లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు.విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో బక్కని రవి మాదిగ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, కుటుంబంలో అందరికీ మంచి జరగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టే అవకాశం కలగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. గ్రామంలో ఐకమత్యంతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బదుసు ప్రవీణ్, బక్కని అశోక్, ఆశపల్లి శంకరయ్య, బక్కని సిద్దు, పెంజర్ల బబ్లు, గుండెపు మహేందర్, తిరుమలి అరవింద్, కొండని శివ, పెంజర్ల నరేష్, బదుసు చంద్రయ్య, బక్కని సుమన్, బక్కని శంకరయ్య, ఎర్ర నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 23,(ప్రజా కలం): రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగా రెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడం, ప్రభు త్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై డిప్యూటీ సీఎం తో చర్చించారు. తనకు పూర్తి సహకారం అందించాలని కోరగా, డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా చర్చించారు.




నిమజ్జనం ఘాట్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



మల్కాజిగిరి, సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్ వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనం ఘాట్‌ను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బుధవారం సందర్శించి పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేవట్టిన ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనం ఘాట్ వద్ద భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, ఎస్.ఆర్. ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, వైనాల ప్రవీణ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రామచందర్, కన్నెమల్ల నాగరాజు, సురేష్ సింగ్, సత్యనారాయణ, పార్థ, శంకర్ రావు, రామకృష్ణ, రాము, ఇస్తారి, సందీప్ గౌడ్, వెంకన్న, సిరిగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సేవే తన లక్ష్యం

యువత సేవా కార్యక్రమాల వైపు ముందుండాలి

యూత్ అధ్యక్షులు సంతోష్ రావు

మెదక్ సెప్టెంబర్ 23 (ప్రజాకలం ప్రతినిధి) ప్రజా సేవే తన లక్ష్యం అని, యువత సేవా కార్యక్రమాల వైపు ముందుండాలి అని మెదక్ జిల్లా కొల్చారం మండల యూత్ అధ్యక్షులు సంతోష్ రావు అన్నారు. ప్రజల కష్టాల్లో నేనున్నానంటూ వారికి అండగా నిలున్తూ, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా అయన పాల్గొంటున్నారు. యువతను సమాజ సేవలో భాగస్వాములను చేస్తూ,ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. నిరుపేద కుటుంబాలకు సహాయం అందించడం, అవసరమైన వారికి చేయూతనివ్వడం, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి కార్యక్రమాలతో స్థానికంగా ప్రత్యేక గుర్తింపు అయన పొందుతున్నారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూత సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడమే తన లక్ష్యమని అయన చెబుతున్నారు. అవసరమైన సమయంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ, తన వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. యువతకు ఆదర్శంగా యువత కేవలం వ్యక్తిగత అభివృద్ధికే పరిమితం కాకుండా సమాజం కోసం పనిచేయాలని సంతోష్ రావు సూచిస్తున్నారు. యువతను సమీకరించి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.దీంతో ఆయన వెంట యువత పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ముద్ర ప్రజా సేవను నిరంతర ప్రక్రియగా భావిస్తూ సంతోష్ రావు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. పేదలు, విద్యార్థులు, వృద్ధులు, అవసరంలో ఉన్న కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందిస్తూ తన సేవా బాటను కొనసాగిస్తున్నారు. ప్రజల కోసం ప్రజల మధ్య ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను తెలుసుకోవడం, సాధ్యమైన పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్న సంతోష్ రావు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.యువతను మరింతగా భాగస్వామ్యం చేసి సామాజిక సేవను విస్తరించాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

కొత్తగూడ గ్రామంలో గణేష్ లడ్డూ

రూ. 2 లక్షల 6 వేలకు వేలం

కైవసం చేసుకున్న కందుకూరు మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి



మహేశ్వరం, సెప్టెంబర్ 23,(ప్రజా కలం) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో వినాయక నవ రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. భక్తుల కోలాహలం, భజనల నడుమ జరిగిన ఈ వేలం పాటలో లడ్డూ ప్రసాదం ఏకంగా రూ. 2 లక్షల 6 వేలకు పలికింది.గ్రామంలో కొలువుదీరిన వినాయకుడి లడ్డూను కందుకూరు మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి దక్కించుకున్నారు. అత్యధిక మొత్తానికి పాడి లడ్డూను కైవసం చేసుకున్న ఆయనను గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా బొక్క జంగారెడ్డి మాట్లాడుతూ.. వినాయకుడి లడ్డూను దక్కించుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, గ్రామ అభివృద్ధికి, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయ అభివృద్ధి పనులకు, గ్రామంలో ధార్మిక కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి, సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి): మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బుధవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడు సంపత్



ఆధ్వర్యంలో మహావీర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రాజీవ్ గాంధీ నగర్, గౌతమ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని, ప్రజలు ఐక్యంగా ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, ఎస్.ఆర్. ప్రసాద్, జీడీ సత్యనారాయణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రామచందర్, సత్యనారాయణ, పార్థసారథి, వెంకన్న, సిరిగిరి రాజు, వినయ్ గౌడ్, ఎ.కొండచారి, రాజు, రవీందర్, శారద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇస్నాపూర్‌లో అల్లరి..

ముగ్గురికి జైలు.. -ముగ్గురికి ఒక్కరోజు జైలు..

రూ.500 చొప్పున జరిమానా..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 23 (ప్రజా కలం) ప్రతినిధి

ఇస్నాపూర్‌లోని బెంగళూరు వెంచర్‌లో అల్లరి సృష్టించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన ముగ్గురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది.సెప్టెంబర్ 21 రాత్రి జరిగిన ఘటనపై పటాన్‌చెరు పోలీసులు కేసులు నమోదు చేసి ముగ్గురినీ సంగారెడ్డి



న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.అల్లరి చర్యలకు పాల్పడిన బి. రాజు, బి. జానకీరామ్, కేతవత్ కుమార్తె హైదరాబాద్ నగర పోలీసు చట్టం, నగర పోలీసు చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద మూడు కేసులు నమోదయ్యాయి. సెప్టెంబర్ 23న కేసును విచారించిన న్యాయస్థానం నేరం రుజువైన నేపథ్యంలో ముగ్గురికీ ఒక్కొక్కరికి ఒక రోజు సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధించింది. అల్లరి సృష్టించి ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలపై పటాన్‌చెరు పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారనే విషయాన్ని ఈ చర్య స్పష్టం చేసింది..



అనధికార నిర్మాణాలపై కొరడా

పలు షెడ్లను సీజ్ చేసిన బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులు

మహేశ్వరం, సెప్టెంబరు 23 (ప్రజా కలం): జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా చేపడుతున్న అనధికార నిర్మాణాలపై బడంగ్‌పేట్ సర్కిల్-16 టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పలు అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. సుల్తాన్‌పూర్‌లో.. సర్వే నంబర్లు 60, 61లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్‌ను అధికారులు సీజ్ చేశారు. బాలాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 8, 9, 10లో నిర్మిస్తున్న మరో అనధికారిక షెడ్‌పై చర్యలు తీసుకున్నారు. మల్లాపూర్ గ్రామం సర్వే నంబర్ 2లో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని సైతం సీజ్ చేశారు.



అనుమతులు తప్పనిసరి

జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందకుండా ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి అనధికారిక నిర్మాణాలు చేపడితే జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 461-ూ ప్రకారం నోటీసులు, సీజ్‌తో పాటు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో అనధికార నిర్మాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు, చర్యలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్ ఏసీపీ కళ్యాణ్ చక్రవర్తి, టీపీఎస్ సాయికిరణ్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు జాతీయ గుర్తింపు

హైదరాబాద్,
సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి):

మాదకద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈగల్ ఫోర్స్‌కు లభించిన జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ మూడో జాతీయ సదస్సులో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డును అందుకోవడం తెలంగాణ పోలీసు శాఖకు, రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలకు ఈ జాతీయ



గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడం కేవలం పోలీసు వ్యవస్థ బాధ్యత మాత్రమే కాదని, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, పాఠశాల, సంస్థ, పౌరుడి సమిష్టి బాధ్యత అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని చెబుతూ, వారిని మాదకద్రవ్యాల ప్రభావం నుంచి రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ విక్రయం, వినియోగంపై సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

'నషా ముక్త్ భారత్' లక్ష్య సాధనలో తెలంగాణ నుంచి బలమైన అడుగు పడాలని, 2029 డిసెంబరు నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణం దిశగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ సంకల్పంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలపై పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తూ యువతలో చైతన్యం కల్పించడం, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ద్వారా సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



వినయ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్, మైనంపల్లి

మల్కాజిగిరి, సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి):

వికలాంగుల హక్కుల పోరాట సమితి మేధ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు వినయ్ జన్మదినం సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు లక్ష్మణ్ మాదిగ, ఎం. రామచందర్ మాదిగ, ఎం.జె.ఎఫ్ రాష్ట్ర నాయకుడు మనోహర్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినయ్ అనేక సంవత్సరాలుగా వికలాంగుల హక్కుల కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, వికలాంగుల హక్కుల సాధనతో పాటు సామాజిక ప్రయోజనాల కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, బి.కె. శ్రీనివాస్, మల్కాజిగిరి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీడి సంపత్, ఇస్తారి, పార్థసారథి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల ఉల్లంఘనలపై క్షేత్రస్థాయి పరిశీలన

పార్కింగ్ ప్రదేశాల వినియోగంపైనా అధికారుల దృష్టి



మల్కాజ్‌గిరి, సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి): మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు గుర్తించిన అనుమతి లేని నిర్మాణాలు, జారీ చేసిన నోటీసులు, తొలగింపు చర్యలు, పూర్తయిన కూల్చివేతల వివరాలను కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, ప్రజా స్థలాలు, రాకపోకలకు ఇబ్బంది కలిగించే నిర్మాణాలను ప్రత్యేకంగా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతుల్లో భాగంగా పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్, స్టిల్ట్ ప్రాంతాలను ఇతర అవసరాలకు వినియోగిస్తున్న అంశంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని తెలిపారు. పార్కింగ్ స్థలాల్లో గదులు, దుకాణాలు, కార్యాలయాలు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. మంజూరైన భవన ప్రణాళికకు అనుగుణంగానే నిర్మాణం, వినియోగం కొనసాగుతున్నదా లేదా అనే విషయాన్ని అధికారులు నిర్ధారించాలని పేర్కొన్నారు. ప్రతి ఏసీపీ పరిధిలో అనుమతులు, భవనాల నిర్మాణ స్థితి, వాటి వినియోగంపై ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు.

అనుమతులకు భిన్నంగా నిర్మాణం లేదా వినియోగం ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చర్యలు తీసుకునే ముందు సంబంధిత అనుమతులు, రికార్డులు, భవన ప్రణాళికలు, చట్టవరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. నిబంధనలకు లోబడి ఉన్న నిర్మాణాలకు తగిన మినహాయింపులు వర్తించేలా, ఉల్లంఘనలు ఉన్న వాటిపై మాత్రం చట్ట ప్రకారం చర్యలు జరిగేలా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అనధికార నిర్మాణాలకు సంబంధించిన వ్యవహారాల్లో అవసరమైన చోట న్యాయ విభాగంతో సమన్వయం చేసుకోవాలని, నోటీసులు జారీ చేసిన కేసుల పురోగతి, పెండింగ్ అంశాలు, ఇప్పటికే చేపట్టిన కూల్చివేత చర్యలను నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. భవిష్యత్తులో రహదారులు, ప్రజా వినియోగ ప్రాంతాలకు ఆటంకం కలిగించే నిర్మాణాలు ఏర్పడకుండా ముందస్తు పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, సిటీ ప్లానర్లు కృష్ణమోహన్, శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ మహాగణపతికి టీడీపీ నేతల ప్రత్యేక పూజలు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ప్రజా కలం ప్రతినిధి):

ఖైరతాబాద్ మహాగణపతిని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్ కుమార్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో



కలిసి శోభాయాత్రగా ఖైరతాబాద్ గణేష్ మండపానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మహాగణపతికి ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు అరవింద్ కుమార్ గౌడ్‌కు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. సమాజంలోని ఆటంకాలన్నీ తొలగిపోయి ప్రజలందరికీ మంచి జరగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని గణనాథుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల్ల కిషోర్, టీడీపీ రాష్ట్ర బీసీ మాజీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్, రాష్ట్ర ఎస్సీ మాజీ అధ్యక్షుడు పి. అశోక్, ఎం. శ్యామ్‌సుందర్, భానుప్రకాష్, పి. వంశీకృష్ణ, జ్ఞానేశ్వర్ యాదవ్, సత్తన్న, రవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృ మరణాలపై స్పెషలిస్ట్ వైద్యుల బృందం సమక్షంలో సమగ్ర సమీక్ష సమావేశం, పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి-- జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు

యాదాద్రి భువనగిరి జిల్లా,
సెప్టెంబర్ 23(ప్రజా కలం)

జిల్లాలో మాతృ మరణాలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు.బుధవారం రోజున మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్షా కమిటీ (DLMDRC) సమావేశం జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు, అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 2026--27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇప్పటివరకు నమోదైన రెండు మాతృ మరణాలపై స్పెషలిస్ట్ వైద్యుల బృందం సమక్షంలో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సంభవించిన రెండు మాతృ మరణాలపై నమగ్రంగా సమీక్ష నిర్వహించడం జరిగింది. మాతృ మరణాలు సంభవించడం బాధాకరమని, ముఖ్యంగా నివారించదగిన మాతృ మరణాలు పునరావృతం



కాకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ సమీక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.సమీక్షలో రూపొందించిన మినిట్స్ ఆఫ్ ది మీటింగ్‌ను జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు పంపించి, అందులో సూచించిన చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో నివారించదగిన మాతృ మరణాలు సంభవించకుండా వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు,క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి మనోహర్ మాట్లాడుతూ, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, హై-రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు మరియు సకాలంలో రిఫరల్ సేవలు అందించాలని సూచించారు.గర్భిణి నమోదు చేసిన ప్పటి నుంచి ప్రతి ANC చెకప్‌కు సంబంధించిన వివరాలు, వైద్య చరిత్ర, రక్తం మరియు మూత్ర పరీక్షలు, స్కానింగ్ వివరాలు, హై-రిస్క్ ప్రెగ్నెన్సీ వివరాలను ఏం సి పి కార్డులో పూర్తిగా, తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.ఏ ఎన్ ఎమ్ లు, ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి హై-రిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా ప్రమాదకర గర్భధారణలను ముందుగానే గుర్తించి, సకాలంలో తగిన వైద్య సేవలు అందించడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో DWO శ్రీనివాస్, Dy.CEO సూర్యశ్రీరావు, DCHS సుమన్ కళ్యాణ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ (MCH) శ్రీలక్ష్మి,గైనకాలజిస్ట్ డా. సయ్యద్ అబిద్ అలీ, అనస్థీషియాలజిస్ట్ డా.వీణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ఎం. సాయి రమణి,జనరల్ మెడిసిన్ డా. ఉమా మహేశ్వరి, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,మాతృ మరణాల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం : ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేష్ పిలుపు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) గండి మైసమ్మ చౌరస్తా నుండి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు బుధవారం ఏఐటీయూసీ సంఘంలో చేరారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేశ్ పాల్గొని వారికి సభ్యత్వాలు ఇచ్చి ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏఐటీయూసీ కార్మికుల కోసం, కార్మిక హక్కులు కాపాడడానికి 100 సంవత్సరాల క్రితమే ఆవిర్భవించి నేటికీ దేశంలో అతిపెద్ద గుర్తింపు సంఘంగా పనిచేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాల్లో విస్తరించిన ఏకైక సంఘం ఏఐటీయూసీలో చేరి సభ్యత్వం తీసుకోవడం చాలా గర్వకారణమన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వాటిని సాధించుకునే వరకు ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉద్యమించాలని దానికి సిపిఐ, ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి జిల్లా నాయకులు నర్సింహులు సిపిఐ నాయకులు రాములు బాబు అతిథులుగా పాల్గొని ఆటో డ్రైవర్లకు ఏ కష్టం వచ్చినా స్పందిస్తామని సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా స్థానిక ఆటో డ్రైవర్లు ఖలీల్ అఖిల్ అహ్మద్ బాబర్, రాములు నరసింహ తదితరులు ఏఐటియుసిలో చేరారు.



వినాయక మండపాలను సందర్శించిన ఏలే చంద్రశేఖర్

వలిగొండ సెప్టెంబర్ 23 ప్రజాకలం:గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వలిగొండ మండల కేంద్రంతో పాటు మల్లేపల్లి,గోకారం,జాలు కాలువ గ్రామాలలోని వినాయక మండపాలను బిజెపి



రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్,బీజేపీ నాయకులతో కలిసి గణేష్ మండపాలు సందర్శించి గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం మండపాల నిర్వాహకులు ఏలే చంద్రశేఖర్ ను శాలువాతో ఘనంగా నన్మానించారు.అనంతరం వలిగొండ మండల కేంద్రంలోని అన్నదాన కార్యక్రమం, మల్లేపల్లిలో శ్రీరామ్ యూత్ గణనాథుడి శోభాయాత్రలో పాల్గొన్నారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్,ఉపాధ్యక్షుడు మందల నాగరాజు,వార్డు సభ్యులు మైసోల్ల రామ నర్సు,దంతూరి వరుణ్,మాజీ ఉపసర్పంచ్ మైసోల్ల మత్స్యగిరి,బుగ్గపట్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

లింగం చెరువు వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

అధికారులకు సూచనలు చేసిన కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి


ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సూరారంలోని లింగం చెరువును కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి, ఐపీఎస్ మంగళవారం సందర్శించారు. చెరువు పరిసరాల్లో చేపట్టిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువు పరిసరాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఈవిషయాన్ని సూరారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ బాలరాజు వెల్లడించారు.


అడుగడుగునా నిర్లక్ష్యం

-ప్రజల ప్రాణాలతో చెలగాటం

అంబర్‌పేట్ సెప్టెంబర్ 23(ప్రజాకలం న్యూస్)

రోడ్లపై స్తంభాలకు సాలెగూడుల్లా అల్లుకున్న నెట్వర్క్ కంపెనీలు, ఇంటర్నెట్ వైర్లతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నా అధికారుల్లో చలనం లేదని స్థానికులు మండిపడుతున్నారు.అంబర్‌పేట్ లోని ప్రేమ్ నగర్ లో కేబుల్ వైర్లను కట్ చేసి తొలగించకపోవడంతో క్రిందికి వేలాడుతూ రోడ్డున పోయే వారికి, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇంటర్నెట్ నెట్వర్క్,కేబుల్ కంపెనీల సిబ్బంది పాత వైర్లను తొలగించి కొత్త వైర్లను వేసే క్రమంలోనూ, మరమ్మతులు చేసే క్రమంలోనూ వైర్లను కట్ చేసి తొలగించకపోవడంతో రోడ్లపై వేలాడుతూ వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలు జరిగిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.ఈ విషయంపై ఇటు అధికారులకు గానీ అటు విద్యుత్ శాఖ వారికి కానీ ఫిర్యాదులు చేస్తే పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంటర్నెట్, నెట్వర్క్ కేబుల్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





అంబర్‌పేట్ ప్రేమ్ నగర్ లో రోడ్డుపై వేలాడుతున్న వైర్లు

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com